ఏజీ గార్డెన్‌కు ఎక్కిళ్లు!
● వారానికి ఒక్కసారి నీళ్ల సరఫరా
● నాలుగు బిందెల నీళ్లతో సర్దుకుపోతున్నాం..
● అరకొరగా వీధి లైట్లు
● ఇది జిల్లా కేంద్రంలోని ఓ కాలనీ దుస్థితి
4

ఆ సారు.. పాపం పండింది...

● ఎట్టకేలకు సస్పెన్షన్..
● సిమెంటు, కడ్డీలు అమ్ముకున్నారు..
● భార్య, కొడుకులకు ఫోన్‌పేలో మామూళ్లు
● వైసీపీ హయాంలో లెక్కలేనన్ని అక్రమాలు



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): జిల్లా గృహ నిర్మాణ శాఖలో వైసీపీ హయాం నుంచి లెక్కలేనన్ని అక్రమాలకు పాల్పడిన ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.సాంబశివయ్య పాపం ఎట్టకేలకు పండింది. లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సిమెంటు, కడ్డీలు అమ్ముకోవడంతో పాటు.. తన కింద పనిచేసే సిబ్బంది నుంచి అక్రమ వసూళ్లు, ఆ వసూళ్లు తన భార్య, కొడుకులకు ఫోన్‌పేలకే వేయించుకోవడం వంటి ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖకు వచ్చిన నిర్దిష్ట ఫిర్యాదుపై జరిగిన విచారణలో అక్రమాలు నిజమని తేలడంతో ఆయనను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. వైసీపీ పరిపాలనా కాలం నుంచి ఈయన అవినీతి, అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో అనేక కథనాలు ప్రచురితమయ్యాయి. వైసీపీ నాయకులు చెప్పినట్లు చేయడంతో ఆయన పైన ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఏడాది కిందట కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ఇక ఈ సార్‌. కథ అయిపోనట్లే అని అందరూ అనుకున్నారు. అయితే ఏడాది వరకు ఇతడి అక్రమాలపై ఆంధ్రజ్యోతితో సహా ఇతర పత్రికల్లో వార్తలు వచ్చినా ఈ ప్రభుత్వంలోనూ చర్యలు తీసుకోలేదు. దీంతో ఇక తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ ఆయన బహిరంగంగానే వ్యాఖ్యానించే వారని పలువురు అంటుండేవారు. ఈ నేపథ్యంలో ఆయనను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం సస్పెండ్ చేసింది.

ఇన్‌చార్జ్ పీడీపై వచ్చిన ఆరోపణల్లో కొన్ని..

● హౌసింగ్ ఇన్‌చార్జ్ పీడీపై వచ్చిన ఆరోపణలపై గతంలో అప్పటి రాయచోటి ఆర్డీవో విచారణకు వచ్చారు. ఈ సందర్భంగా ఈయన ఆర్డీవోను తీవ్ర పదజాలంతో దుర్భాషలాడినట్లు సిబ్బంది చెబుతున్నారు.
● తన కింద పనిచేసే ఏఈ (ఎంబీ) పోస్టులను అమ్ముకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.
● నెలనెలా తనకు వచ్చే మామూళ్లను తన కింద పనిచేసే అటెండర్లు, కంప్యూటర్ ఆపరేటర్ల ఫోన్‌పే నెంబర్లకు వేయించుకున్నాడని, తనకు మామూళ్లు ఇవ్వని సిబ్బందిని తన ఇష్టానుసారం బదిలీలు చేసి బెదిరించి.. తన దారికి తెచ్చుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.
● నెలకు దాదాపు లక్ష రూపాయల వరకు వసూళ్లు చేస్తాడనే ప్రచారం ఉంది.
● జిల్లాలో ప్రస్తుతం గృహ నిర్మాణ శాఖలో దాదాపు సుమారు 15 మంది ఎంబీసీ (ఏఈ) లు పనిచేస్తున్నారు. వీరిలో చాలామంది దొంగ సర్టిఫికెట్లతో ఉద్యోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరి వద్ద నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి ఎంబీసీ ఉద్యోగం ఇచ్చాడనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఉన్న కలెక్టర్ ఈ సర్టిఫికెట్లపై విచారణ జరిపించి బోగస్ సర్టిఫికెట్లుగా గుర్తించి ఉద్యోగాలు ఇవ్వనీయకుండా నిలుపుదల చేయించినా.. తర్వాత వచ్చిన కలెక్టర్లను తప్పుదోవ పట్టించి ఉద్యోగాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.
● తన కింది స్థాయి సిబ్బందిని అందరి ముందే బండబూతులు తిట్టేవాడనే ఆరోపణలు ఉన్నాయి.
● ఈయన నిబంధనలకు విరుద్ధంగా ఓ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ఏఈకి రెండు మండలాలు ఇన్‌చార్జ్ (లక్కిరెడ్డిపల్లె, గాలివీడు) ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.
● 2024 జూన్‌లో ఎన్నికల ఫలితాల రోజు 120 ట్రాక్టర్ల ఇసుకను వైసీపీ నాయకులు అక్రమంగా తరలించారు. దీని వెనుక ఈయన హస్తం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.
● ఈయన నెలలో చాలా వరకు బయట ప్రాంతాలకు క్యాంపులకు వెళ్తుంటాడు జిల్లా కేంద్రంలోనే ఉంటాడని, అయినా క్యాంపులకు వెళ్లినట్లు వేలాది రూపాయలు కారు బాడుగ పేరుతో తీసుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.
● తన కింద పనిచేసే మండల ఇన్‌చార్జ్ (ఏఈ)ల దగ్గర తన భార్య, కొడుకుల ఫోన్‌పే నెంబర్లకు మామూళ్లు వేయించుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.
● ఈయన హయాంలో జిల్లాలో సుమారు 10 వేలు పాత ఇళ్లకే బిల్లులు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.
● జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయ నిర్మాణానికి, సుమారు 2 వేలకు పైగా లబ్ధిదారులకు ఇవ్వాల్సిన సిమెంటు బస్తాలు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి.
● సాధారణంగా జిల్లా ప్రాజెక్టు అధికారిగా బీటెక్ చదివిన వాళ్లు అర్హులు. ఈయన పాలిటెక్నిక్ చదివారు. (అయితే ఈయన బీటెక్ చదివినట్లు సర్టిఫికెట్లు ఉన్నాయని, వాటిపైన విచారణ జరిపించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.) అయినా మూడు సంవత్సరాల పాటు ఈయన జిల్లా అధికారిగా కొనసాగడం విశేషం.



ఇద్దరు బాలికలకు రూ.4 వేల స్కాలర్‌షిప్

● గిరిజన కాలనీని సందర్శించిన జిల్లా బాలల పరిరక్షణ అధికారులు



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయల లారీ బోల్తా పడి మృతి చెందిన వారి కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలకు ప్రభుత్వం నుంచి రూ.4 వేలు స్కాలర్‌షిప్ ఇస్తున్నట్లు జిల్లా బాలల పరిరక్షణ అధికారులు పి.రామల్లి, శైలజ తెలిపారు. మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలకు ప్రభుత్వం ద్వారా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సహకారంతో నెలకు రూ.4 వేలు స్కాలర్‌షిప్ అందిస్తారని తెలిపారు. పిల్లల దగ్గర నుంచి దరఖాస్తులు తీసుకున్నామని, చిన్నారుల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పలు సంక్షేమ పథకాలు వస్తాయని తెలిపారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించండి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



అగిగెలవారిపల్లెలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

గుర్రంకొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తక్షణమే తొలగించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని శెట్టివారిపల్లె పంచాయతీ అగిగెలవారిపల్లె సర్వే నెంబరు 26/2లో ప్రభుత్వ భూమిలోని ఆక్రమణలను మంగళవారం కలెక్టర్ పరిశీలించారు. సర్వే నెంబరు 26/2లో పదుల ఎకరాల్లో మేతబీడు పోరంబోకు స్థలం ఉంది. ఈ స్థలంలో గ్రామస్థులు ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే కొందరు మేతబీడు పోరంబోకు స్థలాన్ని ఇష్టానుసారంగా ఆక్రమించుకుని దారి లేకుండా ఇబ్బంది పెడుతున్నారని గ్రామానికి చెందిన ఆదినారాయణ పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ గ్రామానికి వెళ్లి ప్రభుత్వ భూమి ఆక్రమణలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్తి స్థాయిలో సర్వే చేసి సరిహద్దులను గుర్తించి ప్రభుత్వ స్థలంలో బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం గుర్రంకొండ ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారని డాక్టర్ చైతన్యను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని, కాన్పుల సంఖ్య పెరిగేలా సిబ్బంది పనిచేయాలని ఆదేశించారు. అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, డీటీ ఫణికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిపోయిన కంటి చూపు పరీక్షలు

● 112 మంది పింఛనుదారుల రీవెరిఫికేషన్‌కు ఆటంకం
● సదరం స్లాట్ పొందిన వారికీ తప్పని ఎదురుచూపులు



కలికిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సర్వజన ఆస్పత్రి కంటి చికిత్స విభాగంలో కేవలం ఒక టెక్నీషియన్ సెలవులో వెళ్లిన కారణంగా ఐదు రోజులుగా కంటి పరీక్షలు పూర్తిగా ఆగిపోయాయి. చాలా రోజుల వ్యవధి తరువాత ఇటీవలే సదరం బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. కంటిచూపుకు సంబంధించిన వైకల్యం నిర్ధారణ కోసం మదనపల్లె ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో స్లాట్లు కేటాయించారు. అయితే కంటి వైద్యులు అందుబాటులో ఉన్నా కంటి పరీక్షలు చేయడానికి టెక్నీషియన్ ఐదు రోజులుగా సెలవులో ఉండటంతో స్లాట్లు తీసుకుని సుదూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వెళ్లిన వారికి కంటి పరీక్షలు చేయకుండా తిప్పి పంపుతున్నారని వాపోతున్నారు. ప్రస్తుతం పింఛను తీసుకుంటున్న వికలాంగుల వైకల్యాన్ని ధృవీకరించడానికి రీవెరిఫికేషన్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని కంటి చూపు వికలాంగులకు పరీక్షలు చేయడానికి మదనపల్లె ఆస్పత్రిని కేటాయించారు. అక్కడ పరీక్షలు నిలిచిపోవడంతో జిల్లా వ్యాప్తంగా 112 మంది కంటిచూపు వికలాంగులు ఇంకా పరీక్షలు చేయించుకుని వైకల్యాన్ని ధృవీకరించుకోవలసి ఉంది. మిగిలిపోయిన 112 మందిలో మదనపల్లె డివిజన్‌కు చెందిన వారు గురువారం వెళ్లి పరీక్షలకు హాజరు కావాలని ఎంపీడీవో బాలసుబ్బన్న కోరారు. అదేవిధంగా రాయచోటి, రాజంపేట డివిజన్‌లకు సంబంధించి కంటిచూపు వికలాంగులు శుక్రవారం హాజరై పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ రెండు రోజులు పరీక్షలు చేయించుకుంటే ఆ తరువాత మరో అవకాశం ఉండదని ఎంపీడీవో స్పష్టం చేశారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 1.5 కిలోల వెండి, బంగారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారు వెండి వస్తువులను చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మన రాష్ట్రంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో దొంగతనాలకు పాల్పడుతున్న నల్గొండ జిల్లా భువనగిరికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ గజ్జల శ్రీనివాస్ (47)ను అరెస్టు చేశామని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. కడప చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. నిందితుడు గజ్జల శ్రీనివాస్‌పై రెండు రాష్ట్రాల్లో వివిధ పోలీసుస్టేషన్లలో సుమారు 15 కేసులు ఉన్నాయన్నారు. చలమారెడ్డిపల్లె ఎంసీవీఆర్ హాస్టల్‌లోని ఒక ఇంటిలో, కడప పాత బైపాస్ రోడ్డులోని వెంకటసాయినగర్‌లోని 2 ఇళ్లల్లో, సాయినగర్‌లో ఒక ఇంటిలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఈ నాలుగు ఇళ్లల్లో జరిగిన దొంగతనాలకు సంబంధించిన పూర్తి చోరీ సొమ్మును రికవరీ చేశామన్నారు. రికవరీ చేసిన వాటిలో ఒక జత బంగారు బుట్టకమ్మలు, బంగారు ఉంగరం, ఒకటిన్నర కిలోల వెండి వస్తువులు, హోండా మోటారు సైకిలు, ఆరు చేతి గడియారాలు, రెండు కెమెరాలు ఉన్నాయన్నారు. చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలోని దేవునికడప ఆర్చి వద్ద నిందితుడిని అరెస్టు చేసి ఇంకో బాల నేరస్థుడిని అదుపులోకి తీసుకుని ఈ వస్తువులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కడప చిన్నచౌకు ఇన్‌స్పెక్టర్ ఓబులేసు, ఎస్‌ఐలు రాజారాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌తో పాటు పలువురు సిబ్బందిని డీఎస్పీ అభినందించి రివార్డుల కోసం సిఫారసు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

● ఎంపీడీవోల శిక్షణలో డీపీవో రాధమ్మ



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో రాధమ్మ

రాయచోటిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఉమ్మడి కడప జిల్లాలోని 15 మండలాలు, అన్నమయ్య జిల్లాలోని 15 మండలాల ఎంపీడీవోలకు పంచాయతీ పురోగతిపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీల పురోగతి ప్రణాళికలు తయారు చేసేందుకు జిల్లాలోని 30 మంది ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు సమిష్టిగా పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేపట్టాలని, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను చక్కగా నిర్వహణ చేపట్టి గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ నిర్వహించి సంపద సృష్టికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో లక్ష్మీపతి, డ్వామా పీడీ వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఎస్ఈ దయాకర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, డీఈవో కె.సుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, జిల్లాలోని 30 మంది ఎంపీడీవోలు, 30 మంది పంచాయతీ కార్యదర్శులు, 30 మంది డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై నైపుణ్యం సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సుబ్రహ్మణ్యం

● డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు కృత్రిమ మేధపై నైపుణ్యాన్ని సాధించాలని డీఈవో డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం సందర్భంగా మంగళవారం సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బైట్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బైట్ పాఠశాలలో 9, 10వ తరగతి విద్యార్థులకు, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వృత్తి విద్య శిక్షణ అందుబాటులో ఉందని, ప్రభుత్వం నిష్ణాతులైన ట్రైనర్లను అందుబాటులో ఉంచిందన్నారు. నైపుణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, విద్యార్థి సమూహాలతో కూడిన రోల్ ప్లే నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, సమగ్ర శిక్షా సీఎంవో కరుణాకర్, ఏపీవో చంద్రశేఖర్, జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్ యోగేశ్‌కుమార్‌రెడ్డి, పాఠశాల ఒకేషనల్ ట్రైనర్లు మహబూబ్‌బాషా, రామాంజనేయులు, ఆధ్యాపకులు మహమ్మద్ ఖలీద్, ఉపాధ్యాయులు ఫణీంద్ర, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండ హుండీ ఆదాయం రూ.5.23 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

తంబళ్లపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి మల్లయ్యకొండలో భక్తులు హుండీలో సమర్పించిన కానుకల ద్వారా రూ.5,23,275 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో మునిరాజ తెలిపారు. మంగళవారం ఆలయంలో ఈవో, కూటమి నేతలు, భక్తుల ఆధ్వర్యంలో భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. ఈ ఏడాది మార్చి 12 నుంచి జూలై 15వ తేదీ వరకు వచ్చిన హుండీ కానుకలు లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తినాయుడు, జూనియర్ అసిస్టెంట్ రవికుమార్, ఆలయ అర్చకులు ఈశ్వరయ్య, మల్లికార్జున, రికార్డు అసిస్టెంట్ టెంకెట్టి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

● కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

రాయచోటి (కలెక్టరేట్), జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని రాయచోటిలోని కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్లు ధర్నా చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పెన్షనర్లు పెద్ద సంఖ్యలో ధర్నాకు తరలివచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పీసీ రెడ్డెన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశపెట్టిన పెన్షన్ వ్యాలిడేషన్ అమెండ్‌మెంట్‌ను రద్దు చేయాలని, కేంద్రంలో 8వ పే కమిషన్‌ను, రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఉద్యోగ పెన్షనర్లకు కాంప్రహెన్సివ్ హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం అమలు చేయాలని, రైల్వే, విమాన ప్రయాణికులకు సీనియర్ సిటిజన్ కన్సెషన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

మోకాళ్లపై కూర్చుని నిరసన

● మూడో రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

రాయచోటిటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్-36 ప్రకారం టెక్నికల్, నాన్ టెక్నికల్ కింద జీతాలు ఇంజనీరింగ్ కార్మికులకు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రిస్క్ అలవెన్స్ ఇంజనీరింగ్ కార్మికులందరికీ వర్తింప చేయాలని, జీవో నెంబర్-36 ప్రకారం జీతాలు రూ.24,500 అమలు చేయాలన్నారు. మున్సిపల్ కార్మికులందరికీ గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలని, రెండు జతలు చెప్పులు, రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

ఏజీ గార్డెన్‌కు ఎక్కిళ్లు!

- వారానికి ఒక్కసారి నీళ్ల సరఫరా
- నాలుగు బిందెల నీళ్లతో సర్దుకుపోతున్నాం..
- అరకొరగా వీధి లైట్లు
- ఒక్క సీసీ రోడ్డు కూడా లేదు ..
- ఇది జిల్లా కేంద్రంలోని ఓ కాలనీ దుస్థితి

రాయచోటి కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వారానికో సారి తాగునీరు సరఫరా చేస్తుండడంతో జిల్లా కేంద్రంలోని ఏజీ గార్డెన్ ఎక్కిళ్లు పడుతోంది. 2013లో ఏర్పడిన ఈ కాలనీలో దాదాపు 100కు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీ మునిసిపాలి టీ పరిధిలోకి వస్తుందా.. గొర్లముదివేడు గ్రామం చెర్లోపల్లిలోకి వస్తుందా అనే సంధిగ్ధంతో సుమారు పదేళ్ల పాటు అభివృద్ధి కుంటుపడింది. 2022లో ఈ కాలనీ మున్సిపాలిటీలోకి వస్తుందని అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి రాయచోటి మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా నీరు సప్లై చేస్తున్నామని చెబుతున్నారు. అయితే, వారానికి ఒక్కసారి మాత్రమే తాగు నీరు అందుతోందని, ఈ ట్యాంకర్లు ఎప్పుడొస్తాయో తెలియక రాత్రింబవళ్లు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఇంటికి కేవలం నాలుగు బిందెలు మాత్రమే ఇస్తున్నారని, ఈ నీళ్లతో వారమంతా సర్దుకుంటున్నామని చెబుతున్నారు. ఇలా కాకుండా ఈ కాలనీలో ఒక బోరు వేస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.



కాలనీలోని మట్టి రోడ్డు

భయం భయంగా బతుకుతున్నాం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఏజీ గార్డెన్ కాలనీలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో భయం భయంగా బతుకుతున్నామని, సాయంత్రం 6 దాటితే చిన్నపిల్లలు, ఆడవారు బయటికి రాకుండా ఇళ్లకే పరిమితం అవుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. దాదాపు పదేళ్లుగా నరకం అనుభవిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా, అరకొరగా లైట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వతమైన పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. ఇంత పెద్ద కాలనీలో కనీసం ఒక్క సీసీ రోడ్డు కూడా వేయకపోవడం చాలా దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఏజీ గార్డెన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



నీళ్ల కోసం స్థానికులు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు

ఎగువకాలనీ మా పరిధిలోకి రాదు

ఏజీ గార్డెన్‌లో దిగువ కాలనీ మా పరిధిలోకి వస్తుంది. ఎగువ కాలనీ మా పరిధిలోకి రాదు. ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరా విషయం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడగండి. ఆ కాలనీ మొత్తం చెర్లోపల్లి పంచాయతీలోకి వస్తుంది. అయినా నీరు సరఫరా చేస్తున్నాం.

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్

తైయేరియాసిన్ టీకాలు వేయించండి

- జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై



టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జేడీ గుణశేఖర్ పిళ్లై

కలకడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): పాడి పశువుల్లో తైయేరియా సిస్ వ్యాధి నివారణకోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న టీకా శిబి రాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై సూచించారు. కలకడ మండలం పొత్తూరివారి పల్లెలో తైయేరియాసిస్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పాడి ఆవులకు తీవ్రమైన జ్వర లక్షణాలుంటాయని తెలిపారు. దీని ప్రభావంతో పాల ఉత్పత్తి తగ్గి రైతుల ఆదాయానికి గండి పడుతుందన్నారు.

జిల్లాలోని పశుకేంద్రాల్లో 18 వేల డోసుల టీకాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టీకా లక్ష్య సాధనలో రాష్ట్ర స్థాయి లో జిల్లా మూడవ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణయ్య, శివారెడ్డి, లోకేశ్, తేజకల్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి : జేడీఏ



రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

చిన్నమండెం, జూలై15(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.567 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని జేడీఏ శివ నారాయణ సూచించారు. మంగళవారం కొత్త పల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాభావం నేపథ్యంలో రాగి, ఉద్దులు, పెసర, కంది వంటి పంటలను సాగు చేయాలని రైతులకు వివరించారు.ఎంఏవో రమేశ్‌రాజు, బీ. గీతా, ఆర్‌ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను వేటాడిన కేసులో గోపవరం మండలం వెంకటరామాపురం గ్రామానికి చెందిన బొడిమిగుంట రమణయ్యను అరెస్ట్ చేసినట్లు సిద్దవటం అటవీ శాఖ క్షేత్ర అధికారి కళావతి తెలిపారు. మంగళవారం స్థానిక అటవీ కార్యాలయంలో ఆమె వివరాలు వెల్లడించారు. సోమవారం సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధిలోని అట్లూరు మండలం చెల్లంగారిపల్లె సమీపంలోని పెనుశిల లక్ష్మీనరసింహ అభయారణ్యంలో ముగ్గురు వ్యక్తులు నాటు తుపాకీతో కొండగొర్రెను వేటాడి, మాంసాన్ని వండుకుని తింటుండగా దాడులు చేసి రమణయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఇద్దరు పారిపోయారని తెలిపారు. పారిపోయిన వ్యక్తులు అట్లూరు మండలం చల్లంగారిపల్లెకు చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్య, గుమ్మల శ్రీనుగా గుర్తించామన్నారు. వీరి కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆరు వన్యప్రాణుల కాళ్లు, వండిన మాంసం కత్తులు, టార్చిలైట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించి సిద్దవటం కోర్టులో హాజరుపరిచామని వివరించారు. వన్యప్రాణులను వేటాడినా, హానితలపెట్టిన చట్టాలు చాలా తీవ్రంగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ వన్యప్రాణుల సంరక్షణకై పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య



చౌడప్ప మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భార్య మందలిం చడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం, రామాపురానికి చెందిన వెంకటరమణ కుమారుడు చౌడప్ప (30) బి.కొత్తకోట మండలం, కనికలతోపు వద్ద ఉంటూ, టాటా ఏస్‌లో నీళ్ల సరఫరా చేస్తూ జీవిస్తున్నాడు. సంపాదించిన డబ్బంతా వివాహేతర సంబంధాలకు ఖర్చు చేస్తున్నావంటూ అతని భార్య కనకలక్ష్మి మందలించడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడిఉన్న యువకుడిని కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి. కొత్తకోట పోలీసులు తెలిపారు.

ప్రియురాలు మాట్లాడలేదని..



జయపాల్‌నాయక్ మృతదేహం

రాజంపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతి ఫోన్‌లో మాట్లాడలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం వెంకటపల్లె తాండాకు చెందిన బాల్యా జయపాల్‌నాయక్(19) మోటారు మెకానిక్‌గా పని చేస్తూ రాజంపేట పట్టణంలోని మన్నూరులో నివాసం ఉంటున్నాడు. ప్రేమించిన యువతి ఫోన్‌లో మాట్లాడలేదని మనోవేదనకు గురై, సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



మృతి చెందిన మల్లికార్జున

మదనపల్లె అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కింద పడి ఓ యాచకుడు మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మొలకల చెరువు మండలం, బురకాయలకోటకు చెందిన గోవిందు కుమారుడు మల్లికార్జున (23)కు మతిస్థిమితం లేదు. కొంతకాలంగా ఇతను మదనపల్లెలో భిక్షాటన చేస్తూ కడుపు నింపుకునేవాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వద్ద కూర్చుని ఉన్న అతను హఠాత్తుగా రోడ్డుపైకి రావడంతో మదనపల్లె నుంచి గాలివీడుకు వెళుతున్న ఆర్టీసీ వన్ డిపో బస్సు వెనుక చక్రం ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు, ఆర్టీసీ వన్ డిపో అసిస్టెంట్ మేనేజరు రేవతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మమృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తామని వన్‌టౌన్ సీఐ ఎరిసావలి విచారించి తెలిపారు.

'బాబుగారూ.. తెలంగాణ ట్రాప్‌లో పడొద్దు'

వేంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై బుధవారం ఢిల్లీలో కేంద్ర జనవరుల శాఖ మంత్రి పీఆర్ పాటిల్ నేతృత్వంలో జరగబోయే సమావేశంలో తెలంగాణ ట్రాప్‌లో పడవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సలహా ఇచ్చారు.మంగళవారం ఆయన వేంపల్లెలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ఆచరణసాధ్యం కాదని మ్యాప్ ద్వారావిలేకరులకు వివరించారు. గోదావరిలో మిగులు జలాలు ఎక్కువగాఉన్నాయని, కొన్ని మేము వాడుకుంటాం కొన్నిమీరు వాడుకోండని తెలంగాణకు బాబు సూచించడం అవగాహనరాహిత్యమన్నారు.

గణితంపై భయాన్ని పోగొట్టాలి

- విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి
- డీఈవో సుబ్రమణ్యం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జూలై15(ఆంధ్రజ్యోతి): గణితంపై విద్యార్థులకు ఉండే భయాలను పోగొట్టడానికి గణితం క్లబ్బులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మధ్యాహ్నం డైట్ అధ్యాపకులు శివభాస్కర్, కేదార్‌నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామానుజన్ మ్యాథ్స్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మరింత ఆసక్తికంగా, అర్థమయ్యేలా సరళ పద్ధతిలో బోధించడానికి గణిత ఉపాధ్యాయులు నూతన విధానాలను అనుసరించాలన్నారు. ఇందుకు గణిత ఆటలు, పజిల్స్ క్విజ్‌లు వంటివి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమస్య పరిష్కార నైపుణ్యాలు తార్కిక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన వంటి వాటిని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ డైట్ ఒక ప్రయోగశాలగా బోధనాభ్యసనలో వినూత్న విధానాలను రూపొందిస్తోందన్నారు. మెరుగైన ఫలితాల సాధన దిశగా డైట్ అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి జనార్దన్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ బాబు, అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి, వైసీ రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉర్దూ విద్య'ను బలోపేతం చేయండి

- విద్యాశాఖ మంత్రికి రూటా నేతల వినతి

రాయచోటిటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని ఉర్దూ అంగన్వాడీల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఒక కార్యాచరణ ప్రకటించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాక్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మెగా డీఎస్సీలో ఉన్నతీకరించిన పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు చూపించలేదని, వెంటనే ఆ స్థానాల్లో అర్హులైన ఉర్దూ మీడియం విద్యా వలంటీర్లను నియమించాలని వారు కోరారు. 1997, 2000 సంవత్సరాల్లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ, రోష్ని పథకం కింద దాదాపు 210 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్థాపించి ఉర్దూ విద్యా రంగానికి జీవం పోశారని గుర్తు చేశారు. ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేసి అవసరమైన ప్రాంతాల్లో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలన్నారు. జిల్లాల్లోని దాదాపు 520 ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠశాలల్లో చదువుకుంటున్న ముస్లిం మైనారిటీ విద్యార్థులు ఉర్దూ మొదటి భాషగా చదవడానికి వీలు కల్పించాలని, అందుకు అనుగుణంగా ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

ఉర్దూ అంగన్వాడీలు స్థాపించాలన్న ముస్లిం మైనార్టీల దశాబ్దాల కల నేటికీ తీరలేదన్నారు. కోరుతున్నా అది నేటికీ జరగలేదని, ముస్లిం మైనార్టీల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉర్దూ అంగన్వాడీలు స్థాపించి చరిత్రలో నిలిచిపోవాలని వారు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహిస్తున్న ఉర్దూ డిపార్టుమెంట్‌ను శాశ్వతంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, అవసరమైన ఉర్దూ ఆచార్యుల పోస్టులు మంజూరు చేసి ఉర్దూ భాషాభివృద్ధికి పాటుపడాలని వారు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తాళ్లపాకలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



కొలువు దీరిన సిద్దేశ్వర చెన్నకేశవ స్వాములు

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక గ్రామంలో సుమారు 9 రోజులుగా జరుగుతున్న చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో చెన్నకేశవ, సిద్దేశ్వర స్వాములకు వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలతో అభిషేకం చేశారు.

వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పెద్దమండ్యం, జూలై 15(ఆంధ్రజ్యోతి) మండలంలోని దిగువపల్లికి చెందిన నల్లమ్మ(79) హత్య కేసులో భాగ్యమ్మ, నాగేంద్రనాయుడులను మంగళవారం మండలంలోని బండ్రేవు సమీపంలో అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు తెలిపారు. దిగువపల్లి కి చెందిన లక్ష్మయ్య, నల్లమ్మ దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉండగా, అందరికీ వివాహాలయ్యాయి. తండ్రి లక్ష్మన్న మృతి చెందడంతో నల్లమ్మను నెలకు ఒకరు పోషించేలే కొడుకులు తీర్మానించుకున్నారు. ఈ క్రమంలో కొడుకు ఆర్. చంద్రశేఖర్‌నాయుడు వంతు రాగా జూలై 1న వారి ఇంటికి నల్లమ్మ వెళ్లింది. ఈ వ్యవహారం ఇష్టం లేని చంద్రశేఖర్ నాయుడు భార్య భాగ్యమ్మ తరుచూ గొడవ పడేది. ఈ నెల 10న చంద్రశేఖర్‌నాయుడుతో భాగ్యమ్మ గొడవ పడింది. అత్త నల్లమ్మను ఇంటి నుండి తరిమి వేయాలన్న ఉద్దేశంతో రాయచోటిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుకుంటున్న కొడుకు నాగేంద్రనాయుడుకు ఫోన్ చేసి ఇంటికి రప్పిచ్చింది. ఈ గొడవలకు కారణం నాయనమ్మ నల్లమ్మేనంటూ కొడుకును రెచ్చగొట్టింది. ఆదే రోజు సాయంత్రం నల్లమ్మతో భాగమ్మ గొడవ పడుతున్న సమయంలో నాగేంద్రనాయుడు నల్లమ్మ (79) తలకు వెనక భాగంలో ఇటుక రాయితో దాడి చేశాడు. ఛాతీపై కూర్చోని పిడిగుద్దులు గుద్దడంతో ఆమె స్పృహ కోల్పోయింది. విషయం గమనించిన సమీప బంధువులు 108 వాహనంలో తంబళ్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడడంతో తిరుపతి రుయా అసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ 11వ తేదీ రాత్రి మృతి చెందింది. 12వ తేదీ శనివారం నల్లమ్మ మనుమడు రాజశేఖర్ నాయుడు పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు భాగ్యమ్మ, నాగేంద్రనాయుడు ఇద్దరిపై హత్య కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం నిందితులను అరెస్టు చేసి తంబళ్లపల్లి కోర్టుకు తరలించింగా, రిమాండ్‌కు ఆదేశించినట్లు పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

డ్రిప్పు, స్ప్రింకర్లకు సబ్సిడీ



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలత

సుండుపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ ధరలపై డ్రిప్పులు, స్ప్రింక్లర్లు ఇస్తున్నట్లు మైక్రో ఇరిగేషన్ పీడీ సాయిప్రసన్న తెలిపారు. సుండుపల్లె-3 పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్రిప్‌లు 90 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు 50 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు తెలిపారు. కావలసిన వారు రైతు సేవా కేంద్రాల్లో నగదును చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి వ్యవసాయ తోడ్పాటుకు దోహదపడుతుందన్నారు. పంటలు సాగు చేసిన రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీలత తెలిపారు. మంగళవారం సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రం లోఆమె మాట్లాడుతూ వరి, వేరుశనగ, టమోటా సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలన్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందన్నారు. కౌలు రైతులను గుర్తించి వీఆర్‌వో లాగిన్‌లో నమోదు చేయాలని, రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారనే విషయాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పాస్‌పోర్టు కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి

కలికిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్‌పోర్టు వ్యవహారానికి సంబంధించి సుండుపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదయిన కేసులో నిందితునిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాస్‌పోర్టు విషయంలో అబ్దుల్ సలాం కుమారుడు ఎస్.అజమ్‌తుల్లా మోసానికి పాల్పడినట్లు సుండుపల్లె పోలీసు స్టేషన్‌లో 2022లో నమోదయిన కేసులో పాత ఐపీసీ ప్రకారం 420 (కొత్త చట్టం ప్రకారం సెక్షన్ 318(4) భారతీయ న్యాయ సంహిత-2023), ఇండియన్ పాస్‌పోర్ట్ యాక్ట్-1967లోని సెక్షన్ 12(1)(ఎ)(బి)ల కింద అభియోగాలు నమోదయ్యాయి. నిందితుడు ఈ వ్యవహారంలో నేరపూరిత ప్రయత్నాలు చేసినట్లు నిర్ధారణ అయినందున అతన్ని ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రభుత్వం నుంచి రాష్ట్ర డీజీపీ అనుమతి కోరారు. ఈ మేరకు తగిన అనుమతులు జారీ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులను చూపుతున్న ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తదితరులు

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని బోయనపల్లె ఆర్టీవో కార్యాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తెలిపారు. నిందితులు ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లెకు చెందిన ఈశ్వరయ్య, రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన తోడేటి శేఖర్ నుంచి 2.150 కిలోల గంజాయిని, రెండు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలియజేవారు.

ఉప్పరాండ్లపల్లి సర్పంచు అరెస్టు

- చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన పర్యవసానం




పోలీసుల అదుపులో అయూబ్ బాషా

తిరుపతి(నేరవిభాగం), జూలై 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో.. అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన కేసులో కడప జిల్లా ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచ్ షేక్ అష్రద్ అయూబ్‌బాషాను తిరుపతి సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చక్రాయపేట మండలం ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచి షేక్ అష్రద్ అయూబ్ బాషా వైసీపీకి విధేయుడు. 2024లో తన ఫేస్‌బుక్ ఖాతాలో చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టాడు. అప్పట్లో చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. మంగళవారం నిందితుడు తిరుపతిలో ఉన్నట్లు సీఐడీ పోలీసులకు సమాచారం రావడంతో అతడి సెల్‌ఫోను నెంబరును ట్రాక్ చేసి అరెస్టు చేశారు. గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐడీ సీఐ రంగస్వామి చెప్పారు.

వాటర్ ప్లాంట్ల మూసివేత

- పంచాయతీ అధికారుల సమన్వయ లోపం
- ప్యూరిఫైడ్ వాటర్ కోసం జనం ఇక్కట్లు




మూతపడిన వాటర్ ప్లాంటు

పీలేరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తున్న 12 వాటర్ ప్లాంట్లు మూతపడ్డాయి. దీంతో ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లపై ఆధార పడాల్సి వస్తోంది. పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయ లోపం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం కోసం పీలేరు పట్టణంలో 26 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి రోజూ ఇంటికి ఒకటి లేదా రెండు క్యాన్లలో తాగు నీరు ఉచితంగా తెచ్చుకొనేవారు. కొన్నేళ్లగా ఈ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ప్రస్తుతం వీటిలో 12 ప్లాంట్లు మూత పడడంతో క్యాన్‌కు రూ.20 వేలు చెల్లించే శక్తి లేక పేదలు, కూలీలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వాటర్ ప్లాంట్లలో పని చేస్తున్న 26 మంది వర్కర్లకు గత పది నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో వారు పలు మార్లు పంచాయతీ ఈవో వద్దకు వెళ్లి జీతాలు ఇవ్వాలని పదేపదే వేడుకున్నారు. పలువురు వర్కర్లు పేద వారు కావడంతో ఒకనెల కాకపోయినా ఇంకోనెలలో ఇస్తారన్న ఆశతో పనిచేస్తున్నారు. తీరా పదినెలలు పెండింగ్ పెట్టడంతోపాటు, ఎప్పుడిస్తారో స్పష్టమైన హామీ ఈవో నుంచి రాకపోవడంతో ప్లాంట్లకు తాళాలు వేస్తున్నారు. జీతాలు చెల్లించకపోవడంతో రోజురోజుకూ మినరల్ వాటర్ ప్లాంట్ల పనితీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉన్నవాటిలో ఇప్పటికే 12 మూతపడ్డాయి. మరి కొన్ని చోట్ల రెండ్రు రోజులకోసారి నీరు ఇస్తున్నారు. మూతపడ్డ ప్లాంట్లలో కొన్ని చోట్ల మోటార్లు చెడిపోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు.

కలెక్టర్ ఆదేశాల కోసం చూస్తున్నాం...



వాటర్ ప్లాంట్లలో పని చేస్తున్న వర్కర్లకు పది నెలల జీతాలు చెల్లించాలి. ఇందుకోసం పీలేరు ఎమ్మెల్యే కలెక్టర్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం పని చేస్తున్న వర్కర్లకు పెండింగ్ జీతాలు ఇస్తేనే ప్లాంట్ల తాళాలు ఇస్తామంటున్నారు. ఇకపై పంచాయతీ వర్కర్లకు వాటర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. త్వరలోనే సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

-లతీఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు గ్రామపంచాయతీ.

పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● పీఎఫ్ ఆర్‌డీఏ చట్టాన్ని రద్దు చేయాలి ● మాజీ ఎమ్మెల్సీలు కత్తి, పోచంరెడ్డిల డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, పాల్గొన్న పెన్షనర్లు

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు సేవలందించిన పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండికేయడం తగదని, వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, పోచంరెడ్డి సుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా మంగళవారం పెన్షనర్లు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పాలక ప్రభుత్వాలు వచ్చినప్పటికీ పెన్షనర్లకు న్యాయం చేయడంలో మీనమేషాలు లెక్కించడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశ పెట్టిన ఫైనాన్స్ వ్యాలిడేషన్ అమైన్మెంట్‌ను రద్దు చేయాలన్నారు. 2018 జనవరి నుంచి డీఆర్ బకాయిలు రాలేదన్నారు. వైసీపీ పాలనలో పెన్షనర్లకు చేసిన మేలు శూన్యమన్నారు. మూడు విడతల పెండింగ్ డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. పెన్షనర్లకు సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశ పెట్టి, ఆసుపత్రులలో క్యాష్ లెష్ చికిత్సలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నారెడ్డి, రామ్మూర్తి నాయు డులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లపై చిన్న చూపు చూడడం తగదన్నారు. ఆర్టీసీ బసుల్లో సీనియర్ సిటిజన్లకు టిక్కెట్లలో రాయితీలు ఇచ్చినట్లుగా రైల్వే, విమాన టిక్కెట్లలో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటేన్ రికవరీ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను తెలంగాణ రాష్ట్రంలో పెన్షనర్లుకు ప్రకటించినవిధంగా మన రాష్ట్రంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పెన్షనర్లకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నేత పట్టాభి రామయ్య, నాగమునిరెడ్డి, కత్తి బ్రహ్మయ్య, దస్తగిరిరెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, దేవానంద్, శివరామిరెడ్డి, శ్రీని వాసరాజు, గానుగపెంట హనుమంతరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'గండి'లో నేడు టెండర్లు

చక్రాయపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు పూలు విక్రయించుకొనే హక్కు, టోల్‌గేట్ వసూలుకు సబంధించి హక్కులు కల్పించేందుకు, శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ, ఏర్పాట్లకు సం బంధించి ఇ-టెండరు/సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక గండి కార్యాలయంలో శ్రావణమాస ఉత్సవాలకు సంబంధించి పులివెందుల ఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు.

'అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి'

కడప రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పరిధిలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి 2023-24 ప్రావిడెంట్ ఫండ్ వివరాలను అంతర్జాలములో పొందురిచామని డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఒక నెలలోపు రాత పూర్వకంగా కార్యాలయానికి తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ వర్క్‌షాప్‌లో ప్రతిభ



స్కౌట్ మాస్టర్లను అభినందిస్తున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ వర్క్ షాప్‌లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్ పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కెపాసిటి బిల్డింగ్ నేషనల్ వర్క్‌షాప్‌లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు బి.ఖాదర్ బాష, సగినాల అహమద్, గైడ్ కెప్టెన్ వి.చంద్రవతి పాల్గొన్నారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో నాయకత్వ లక్షణాలతో పాటు అనేక సామాజికహిత కార్యక్రమాల గురించి వీరు వర్క్‌షాప్‌లో ప్రజెంటేషన్ చేశారు. క్యాంప్‌ను విజయవంతంగా పూర్తిచేసుకుని జిల్లాకు చేరుకున్నారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ కం సెక్రటరీ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ కలిసిన అనంతరం వారిని డీఈఓ అభినందించారు. వీరికి నేషనల్ వర్క్‌షాప్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ కార్యశాలలో నేర్చుకున్న అంశాలను జిల్లాస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో జిల్లాస్థాయిలో పలు శిక్షణ శిబిరాలు, టెస్టింగ్ క్యాంప్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అందించే శిక్షణ కార్యక్రమాల ప్రయోజనాలను జిల్లాలోని స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్‌లు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిత్తూరు జట్టు ఘన విజయం

కడప స్పోర్ట్స్ జులై 15 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేవోఆర్ఎం మైదానంలో మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు కడప జట్టుపై ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. వివరాలిలా..

కేవోఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య గత మూడు రోజులుగా సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.4 ఓవర్లలో 139 పరుగులకే చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. అనంతరం ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 71.4 ఓవర్లలో 383 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టుకు 244 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఇందులో ఫైజాన్ 58 పరుగులు చేశారు. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మంగళవారం 85 ఓవర్లలో 239 పరుగుకు ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టు ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది.

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పొడిగింపు

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం జీవో జారీ చేసినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం కింద రూ.1250లు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ, సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా చెల్లించి లబ్ధిపొందాలని సంచాలకులు తెలిపారు.

వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు కేసులో డాక్టరుతో పాటు మరొకరు అరెస్టు



కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కేసులో డాక్టరుతో పాటు ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమానిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 12న రాత్రి సుమారు 7 గంటల సమయంలో కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ వద్ద ఎంత పని సేచ్చివయ్యా జగనూ.. అని హెడ్డింగ్ పెట్టి 12 పాయింట్స్ కలిగిన ఒక బ్యానరును చెన్నై చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ నారపురెడ్డి నాగార్జునరెడ్డి, గ్లేస్ ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమాని అమృతరాజులు ఏర్పాటు చేశారన్నారు. ఈ బ్యానర్‌ను పరిశీలించగా అందులో రెండు రాజకీయ పార్టీల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణ వాతావరణం సృష్టించి ప్రజాశాంతికి మరియు లా అండ్ ఆర్డరుకు భంగం కలిగించే విధంగా ఉంది. దీనిపై వచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు క్రైం నెం: 148-2025, యు-ఎస్ 61(2) 325 ఆర్‌డబ్ల్యు, 3(5) బీఎన్ఎస్ మేరకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇరువురిని మంగళవారం మధ్యాహ్నం అరెస్టు చేసి, అనంతరం కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎవరైనా వాక్ స్వాతంత్ర్యపు హక్కును దుర్వినియోగం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద అంశాలు కలిగిన బ్యానర్‌లను తయారు చేయకూడదని ఫ్లెక్సీ ప్రింటింగ్ తయారీ యజమానులకు డీఎస్పీ సూచించారు. అలాంటి అంశాలు కలిగిన బ్యానర్లు తయారు చేయాలని మీ వద్దకు వస్తే వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్‌కు తప్పకుండా తెలిపాలన్నారు. బ్యానర్ కింద ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నెంబరును తప్పకుండా ముద్రించాలన్నారు.

మహిళ ఆత్మహత్య



సువార్తమ్మ మృతదేహం

ఎర్రగుంట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కలమల్ల క్రిష్ణానగర్‌కు చెందిన లక్షానిపల్లి సువార్తమ్మ(35) ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహ త్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు... డ్వాక్రా సంఘం నుంచి సువార్తమ్మ రూ.2లక్షలు రుణం తీసుకుంది. దీన్ని ఆమె కుమారుడు వెంకటేష్ తీసుకున్నాడు. అయితే డ్వాక్రా రుణం డబ్బులు చెల్లించాలని కుమారుని అడుగగా లేవని చెప్పడంతో మనస్థాపం చెందిన ఆమె సోమవారం రాత్రి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను ప్రొద్దు టూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించింది. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

కాశినాయన జూలై 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బాలాయపల్లె గ్రామానికి చెందిన వడ్డెపోగు ఓబయ్యపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గత ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి బాలాయపల్లెకు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితీష్‌రెడ్డి లకు ఎస్సీకాలనీలో అంగన్వాడీ భవనం, తాగునీటికి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలని వడ్డెపోగు ఓబయ్య అర్జీ ఇచ్చారు. కాలనీలోని ప్రభుత్వ భూమిలో మేకల దొడ్డికట్టుకున్న కొమ్మునూరు బాగ్యరాజు తన మేకల దొడ్డిని ఎక్కడ ఖాళీ చేయించి అంగన్వాడీ సెంటర్ నిర్మిస్తారోనని అనుమానించాడు. దీంతో తన తమ్ముడు యోహాన్ కుమారుడు కార్తీక్‌తో కలసి మంగళవారం ఉదయం ఓబయ్యపై అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

యూసీఐఎల్‌లో ప్రమాదం.. వ్యక్తికి గాయాలు



వేముల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్‌లో పనులు నిర్వహిస్తున్న ఎస్ఎంఎస్ కంపెనీ సబ్ కాంట్రాక్ట్ నంది కంపెనీలో మేట్‌గా పని చేస్తున్న అబ్దుల్లా ప్రమాదానికి గురయ్యారు. వివరాల్లో వెళితే ... పులివెందుల మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన అబ్దుల్లా మంగళవారం మధ్యాహ్నం మైన్‌లోకి పనికి వెళ్లాడు. ఎక్స్‌కవటేర్‌తో పని చేయిస్తుండగా ఆపరేటర్ పొరపాటున వాహనాన్ని కదిలించాడు. దీంతో వెనుక ఉన్న అబ్దుల్లా మోకాలుకు తగలడంతో కాలు విరిగింది. వెంటనే పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వైవీయూలో డిగ్రీ కోర్సులకు ప్రవేశాలు



మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మంగళ వారం ప్రిన్సిపాల్ చాంబర్‌లో పలువురు డీన్‌లతో కలిసి సమా వేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంలో భాగంగా బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్, ఎర్త్ సైన్స్ కోర్సులలో త్వరలో ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సులు చదవడం ద్వారా భవిష్యత్తు ఆధారిత విద్య లభించడంతో పాటు ఎంచుకున్న రంగంలో లోతైన నైపుణ్యాన్ని గడిస్తారన్నారు. తద్వారా గ్రాడ్యుయేట్‌లను జాబ్ మార్కె ట్‌కు సరిపడా జ్ఞాన స్కిల్ పొంది సమాజ భవిష్యత్తు అవ సరాలు తీర్చగల పౌరులుగా తయారవుతారన్నారు. బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్‌తో పాటు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, నానో- సైన్స్, కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్, టెక్నాలజీ విద్యార్థి ఎంపిక చేసుకొని చదివే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ (హానర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతో పాటు అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, మెటీ రియల్ సైన్స్ చదవచ్చన్నారు. బీకాం (హానర్స్) కంప్యూటర్ సైన్స్‌ను ప్రధాన అంశంగా కలిగి ఉందన్నారు. బిజినెస్ కామర్స్, కంప్యూటర్ సైన్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్ వంటి అంశాలలో బలమైనపునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్సు ఉత్తమ మార్కులతో పూర్తిచేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశం ఉందన్నారు. వైవీయులో వినూత్నమైన కోర్సులు, అత్యాధునిక ల్యాబ్‌లు, నిష్ణాతులైన, ప్రపంచస్థాయి గుర్తింపుపొందిన పరశో .దకులు, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం ఉందన్నారు. సమావేశంలో పూర్వ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రగునాథరెడ్డి, డీన్ ఫర్ అకడమిక్ అఫైర్స్ చంద్ర ఓబుళరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

● రూ.21.28 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల



పులివెందులలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పులివెందుల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్‌శాఖ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాలలో ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వలు, ప్రత్యక్ష వినియోగం బదిలీ మిషన్ ద్వారా అమ్మకాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ దుకాణంలో ఫారం-ఓ నమోదు కాని ఎరువులు, అనుమతి పారాలు లేని సుమారు రూ.5.92 లక్షల విలువైన ఎరువులు, మరో ఫర్టిలైజర్స్ దుకాణంలో వివిధ కారణాలతో సుమారు రూ.15.36లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ వ్యవసాయాధికారి గోవర్ధన్, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు మండలంలో...

ముద్దనూరు జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు, కర్నూలు జిల్లా డీఆర్సీ ఏడీఏలు వెంకటేశ్వర్లు, కడప జేడీఏ టెక్నికల్ ఏవో గోవర్ధన్ ఎరువుల దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్లు, గోడౌన్‌లో నిల్వ చేసిన ఎరువులను పరిశీలించారు. లైసన్స్ లేకుండా వ్యాపార లావాదేవీలు సాగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేరాలు, బెయిల్ మంజూరుపై సమీక్ష



వర్చువల్ పద్ధతిలో రివ్యూ చేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంపౌండబుల్ నేరాలు, ఖైదీల బెయిల్ మంజూరుపై మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి తన చాంబర్‌లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని కోర్టు ద్వారా బెయిల్ మంజూరు, కాంపౌండబుల్ నేరాలు, సెక్షన్ 479 బీఎన్ఎస్ఎస్, సెక్షన్ 436ఏ సీఆర్‌పీసీ, 479 బీఎన్ఎస్ఎస్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా పక్రుద్దీన్, కడప, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ, కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ, పురుషుల, మహిళ కేంద్ర కారాగారాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే చర్యలు తప్పవు

● 30 మందిపై కేసు నమోదు

పులివెందుల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి, పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్‌బాష పేర్కొన్నారు. 'సేవ్ క్యాంపస్' పేరిట మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీ నాయక్ సూచనల మేరకు పొగాకు ఉత్పత్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో సిగరెట్లు, బీడీలు తాగవద్దన్నారు. పోలీసుల హెచ్చరిక కాదని బహిరంగ ప్రదేశాలలో వీటిని వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు దుకాణాల్లో, బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో బహిరంగ ప్రదేశాలలో సిగరెట్లు, బీడీలు తాగే 30మందిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిపై రూ.6వేలు జరిమానా విధించామని తెలిపారు.

బీజేపీ నేత కందుల మురళీమోహన్‌రెడ్డిపై దాడి



దాడిలో గాయపడిన కందుల మురళీమోహన్‌రెడ్డి

కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజా రెడ్డివీధిలో కందుల రాజమోహన్‌రెడ్డి తనయుడు, బీజేపీ నేత కందుల మురళీమోహనరెడ్డిపై కేఎస్ఆర్ఎం కళాశాల గ్రూప్ చైర్మన్ కందుల చంద్ర ఓబులరెడ్డి ఆలియాస్ నాని తన అనుచరులతో దాడి చేసి గాయపరిచినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. రాజారెడ్డి వీధిలోని కందుల రెసిడెన్షియల్‌లో కింద ఫ్లోర్‌లో కందుల మురళీమోహన్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. అదే అపార్ట్‌మెంటులోని పై అంతస్తులో చంద్ర ఓబుల్ రెడ్డి ఉంటున్నారు. అయితే సాయంత్రం మురళీ మోహన్‌రెడ్డి తన పెద్దమ్మతో మాట్లాడుతున్న సమయంలో చంద్ర ఓబుల్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి దాడి చేసి గాయపరిచాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆయనను రిమ్స్‌కు తరలిం చినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చంద్ర ఓబుల్‌రెడ్డి అలియాస్ నానిపై 323, 341, 34 రెడ్‌విత్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా బాధి తుడు మురళీ మోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను తన పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఆస్తి పంపకాల గురించి మాట్లాడుతున్న సమయంలో చంద్ర ఓబుల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రస్తాను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోండి

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడపలోని ఏపీఐ టీసీలో పరిశ్రమల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రాంతంలో జిల్లాలో పేరెన్నికగన్న ఓ ఎలక్ట్రికల్ దుకాణ దారులు దౌర్జన్యంగా దారిని ఆక్రమించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీఐ టీసీ జోనల్ మేనేజర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. 2008లో ప్లాటు నంబరు 43ను ఏపీఐటీసీ అధికారులు విక్రయించగా తాము కొనుగోలు చేశామన్నారు. తమ ప్లాట్లకు వెళ్లే రస్తాను లేకుండా సంబంధిత ఎలక్ట్రికల్ దుకాణ యజమానులు రస్తాను ఆక్రమించారని ఆరోపించారు. వెంటనే ఈ రోడ్డు ఆక్రమణను తొలగించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అందుబాటులో యూరియా

పెనగలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులకు యూరియా అందుబాటులో ఉందని ఏవో సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలానికి 20 మెట్రిక్ టన్నుల యూరియాను ప్రభుత్వం మంజూరు చేసిందని, పెనగలూరు-2, ఓబిలి రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వ ఉందన్నారు. యూరియా కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకునిపోయి కూపన్లు రాయించుకోవాలన్నారు.

ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన విద్యార్థి

చిన్నమండెం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువగొట్టివీడు గ్రామ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెడ్డి నిరంజన్ అనే విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. గ్రామీణ నేపథ్యం ఉన్న పాఠశాలలో చదివి ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో 561 మార్కులతో సీటు సాధించడంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థిని ఉపాధ్యాయ బృందం సత్కరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లె, జూలై 15(ఆంధ్రజ్యోతి): 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన నవోదయలో 6వ తరగతిలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో చక్రేనాయక్ తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. చివరి తేది జూలై 29వ తేది ఐదవ తరగతి చదువుతున్న ప్రతి విద్యార్థి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

నేడు మండల ఉపాధ్యక్ష-1 ఎన్నిక

సంబేపల్లె, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల ఉపాధ్యక్ష-1 కొరకు నేడు బుధవారం ఎన్నిక ప్రక్రియ చేపడుతున్నట్లు ఎంపీడీవో రామచంద్ర మంగళవారం తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఇటీవల మండల ఉపాధ్యక్ష-1కు గుట్టపల్లి ఎంపీటీసీ అభ్యర్థి పొత్తూరి రవీందర్‌నాయుడు రాజీనామా చేయడంతో ఎన్నిక ప్రక్రియ అనివార్యమైనట్లు తెలిపారు. బుధవారం మండలంలోని 11 మంది ఎంపీటీసీ సభ్యులందరూ 11 గంటలకు మండల పరిషత్ సభాభవనంలో హాజరుకావాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సభ్యులకు సమాచారాన్ని చేరవేశామన్నారు. ఉపాధ్యక్ష-1 ఎన్నిక ప్రక్రియను చట్టపరంగా చేపట్టి ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హాజరుకావాలని తెలిపారు.

జిల్లా నూతన కార్యవర్గం

రామాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, రాయచోటి ఏరియా అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డిల ఆధ్వర్యంలో నూతన కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా నవీన్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా చెన్నూరు అన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా షబ్బీర్‌బాషా, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ అన్వర్, సహాయ కార్యదర్శిగా నాగయ్యలను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడారు.

'సామాన్యులకు న్యాయం'

రామాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు పాలనలో సామాన్యులకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ ఐటీడీపీ ఛాంపియన్ నాగభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో మంగళవారం దిగువ దళితవాడ గ్రామంలో చంద్రబాబునాయుడు 4.1 సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీలను పూర్తి చేసి సామాన్యునికి అండగా నిలిచింది కూటమి ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ ఇన్‌చార్జిలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు దర్గా స్వామి జయంతి

రామాపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): సద్గురు దర్గా స్వామి 95వ జయంతి దినోత్సవం నీలకంఠ్రావుపేట సమీపంలోని సాయినగర్ సాయివిద్యామందిర్ ఆశ్రమంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సద్గురువు ఆశీస్సులు పొందాలని కోరారు.

పెచ్చులూడుతోన్న ఆర్‌డబ్ల్యూఎస్

- శిథిలావస్థలో కార్యాలయ భవనం
- భయాందోళనలో సిబ్బంది



రైల్వేకోడూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ భవనం

రైల్వేకోడూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయ భవనాన్ని 1982లో నిర్మించారు. అప్పట్లో భవనాన్ని నాశిరకంగా నిర్మించడంతో కార్యాలయ భవనం పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుకుంది. భవనం రోజురోజుకు దెబ్బతింటోంది. కార్యాలయంలో పనిచేయాలంటే ఎప్పుడు కూలుతుందోనని అధికారులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. శ్లాబు, వరండా, బీముల్లో ఇనుప కడ్డీలు బయటపడ్డాయి. కార్యాలయం ముందు భాగం గోడ కొంత భాగం పడిపోయింది. శ్లాబుకు ఉన్న ఫ్యాన్లు ఎక్కడ ఊడిపడిపోతాయోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. భయటపడిన ఇనుప కడ్డీలు కూడా తప్పుపట్టాయి. అంతేకాకుండా వర్షాకాలంలో భవనం ఉరుస్తుండడంతో రికార్డులు తడుస్తున్నాయి. గతంలో చాలా సార్లు నూతన భవనానికి ఉన్నతాధికారులకు నివేదికలు పంపినా ప్రయోజనం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు నూతన భవనానికి నిధులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.



కార్యాలయం లోపలి భాగంలో శ్లాబు పెచ్చులూడి కడ్డీలు దర్శనమిస్తున్న దృశ్యం

ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏమంటున్నారంటే

నూతన భవనానికి నివేదిక తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహేష్ తెలిపారు. నిధులు మంజూరు కాగానే నూతన భవనానికి శ్రీకారం చుడతామని తెలిపారు. భవన నిర్మాణంలో గతంలో ఏం జరిగిందో తెలియదు గాని భవనం పూర్తిగా దెబ్బతిందని వివరించారు.



కార్యాలయం వరండా భాగంలో దుస్థితి

టీడీపీ మండల ఎన్నికల్లో రభస

- పోలీసుల రంగ ప్రవేశం

పుల్లంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీనివాస కల్యాణమండపంలో మంగళవారం నిర్వహించిన పుల్లంపేట టీడీపీ మండల కమిటీ ఎన్నిక రసాభాసగా మారింది. నియోజకవర్గ పరిశీలకుడు హేమాంబదరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తెలియకుండా మండల కమిటీ ఎన్నిక ఎలా నిర్వహిస్తారని పరిశీలకుడికి ఫిర్యాదు చేశారు. పార్టీ సిద్ధాంతాలను కాదని ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. నామినేటెడ్ పదవులు, మండల పార్టీ పదవులు సీనియారిటీ ప్రాతిపదికన కుల సమీకరణలను పరిగణలోకి తీసుకుని చేపట్టాలన్నారు. ఈ విషయాలను ఫిర్యాదులో చూపడం జరిగిందని, సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ మంత్రి నారా లోకేష్‌లకు తెలియజేయాలన్నారు. టీడీపీ నాయకుల మధ్య కొంతసేపు వాదోపవాదాలు జరిగాయి. వల్లూరుపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి సర్దుబాటు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిశీలకుడు మాట్లాడుతూ ప్రస్తుతం నాయకులు, కార్యకర్తల నుంచి సలహాలు తీసుకుంటామని, తిరిగి సమావేశాలు నిర్వహించి మండల కమిటీ వేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ నేలపాటి రామచంద్రనాయుడు, మాజీ మండల అధ్యక్షుడు ఆరే సుధాకర్‌నాయుడు, పోలూరు కృష్ణమనాయుడు, కేశినేని నారాయణనాయుడు, నందవరం అజయ్‌బాబు, కాపెర్ల చంద్రశేఖర్‌నాయుడు, పద్మాకర్‌రెడ్డి, ముద్దా సుభాష్‌రెడ్డి, రొంపిచర్ల మురళీ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన శ్రీనివాస్‌యాదవ్



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడితో శ్రీనివాస్‌యాదవ్

రాయచోటిటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్‌ను బీజేపీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ పీఎం విశ్వకర్మ యోజన జిల్లా ఇంప్లిమెంటేషన్ కమిటీ సభ్యుడు చీర్ల శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న రాజకీయ పరిస్థితులు, పేద ప్రజల అభివృద్ధికి బీజేపీ ద్వారా చేపట్టవల్సిన సంక్షేమ కార్యక్రమాల విధి విధానాలను తెలియజేశారు. పార్టీని సంఘటితంగా అభివృద్ధి చేస్తూ పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తల్లో ఉత్తేజం నింపడానికి కార్యకర్తలు అందరూ సమష్టిగా భారతీయ జనతా పార్టీని అభివృద్ధి పరచాలని రాష్ట్ర అధ్యక్షుడు సూచించినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్క పేదవాడికి అందజేయాలని, పేదల పక్షాన పేదల సంక్షేమం కోసం కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

హిమగిరినాథ్ యాదవ్ ...

నందలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు పీవీఎస్ మాధవ్‌ను విజయవాడలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం స్థానిక బీజేపీ నాయకులు హిమగిరినాథ్ యాదవ్, సోదరుడు సూర్యకుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో మండలంలోని పార్టీ విషయాలను ఆయనతో చర్చించి అనంతరం శాలువాతో సత్కరించి స్వామి వివేకానంద ప్రతిమను బహూకరించినట్లు తెలిపారు.

విద్యార్థులను కన్నబిడ్డల వలే చూసుకోవాలి



విద్యార్థినీలతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్

గాలివీడు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థులను తన కన్నబిడ్డల వలే చూసుకోవాలని, వారికి ఏ కష్టం వచ్చినా అందరూ కలిసి సహాయం చేయాలని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. ఆమె మంగళవారం రాత్రి స్థానిక కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ కస్తూర్బా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులందరూ నిరుపేదలని, మీరందరూ కష్టపడి చదువుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని, ఆ లక్ష సాధన కోసం అహర్నిశలు కష్టపడాలని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి ఈ పాఠశాలలో విద్యార్థినీలు చదువుకుంటున్నారని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీ అందరిపై ఉన్నదని తెలిపారు. మెనూ ప్రకారం విద్యార్థినీలకు ఆహారాన్ని అందించాలని తెలిపారు. ముఖ్యంగా వారికి చదువుతో పాటు వారి ఆరోగ్యం కూడా ముఖ్యమని తెలిపారు. విద్యార్థినీలతో కలిసి అక్కడే భోజనం చేశారు.

ఆయిల్‌ఫాం సాగుకు అనుకూలం

- ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి

సిద్దవటం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంట పొలాల్లో ఆయిల్‌ఫాం సాగు పంటలకు అనుకూలంగా ఉంటుందని ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి పేర్కొన్నారు. భాకరాపేట రైతుసేవా కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పంటల సాగులో విసిగిపోయిన రైతులు వాణిజ్య పంటలపై దృష్టి పెట్టాలని రైతులకు సూచించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఆయిల్‌ఫాం పంటలు సాగుకు శ్రీకారం చుట్టామని, మొదటగా బద్వేల్ డివిజన్‌లోని సిద్దవటం మండలం 18 గ్రామ పంచాయతీల్లో ఆయిల్‌ఫాం పంటలు సాగుకు 125 ఎకరాలు పైలట్ ప్రాజెక్టుగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ రైతుసేవా కేంద్రం సిబ్బంది, గ్రామ ఉపసర్పంచ్ ప్రతినిధి నరసింహారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి భరత్‌రెడ్డి

సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలి

పెనగలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పట్టణంలో ఈ నెల 19, 20 తేదీల్లో నియోజకవర్గ స్థాయి సీపీఐ 19వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మహేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరు 26 నాటికి భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తవుతోందన్నారు. ఇప్పటివరకు పేద, బడుగు, బలహీన పక్షాన నిలబడి భూస్వాములు, జమిందారులు, పెత్తందారుల పాలనను ఎదిరించి సాధించిన ఘన విజయాలను ప్రతి పేద వ్యక్తికి తెలిసేందుకే ఈ మహాసభలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జి.ఆదినారాయణ, సహాయ కార్యదర్శి నారాయణ, సభ్యులు పి.ఓబులేశు, బి.రాజశేఖర్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపాక గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలి

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరచాలని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూల భాస్కర్ పేర్కొన్నారు. మంగళవారం తాళ్లపాక చెరువులో బయటపడ్డ శివలింగానికి కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించి పాలాభిషేకం చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో శివలింగం బయట పడిందని, తాళ్లపాక చుట్టుపక్కల ప్రాంతాలు ఎంతో ప్రసిద్ధి క్షేత్రాలని, శివలింగం ఆధారం చేసుకుని శివాలయాన్ని, చెరువును ట్యాంక్‌బండ్ రీతిలో అభివృద్ధి చేయాలన్నారు. తాళ్లపాక రోడ్డును వెడల్పు చేయాలని టీటీడీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం

నందలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నందలూరు రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో భక్తులు స్వామికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

రైల్వేకోడూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం రైల్వేకోడూరులో దాడులు చేశారు. ఈ సందర్భంగా అధికారులు చంద్రశేఖర్, ఎల్లప్ప, పవన్ కుమార్, నవీన్‌లు మాట్లాడుతూ లైసెన్సులు పొందిన గోడౌన్లను తనిఖీ చేశామని తెలిపారు. యూరియా నిల్వలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. పేర్కొన్న ధరల కంటే ఎక్కువ అమ్మవద్దని డీలర్లకు ఆదేశాలు ఇచ్చామని, ఎఫ్‌సీవో ప్రకారం దోషిగా తేలితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో: పట్టణంలో పురుగు మందులు, ఎరువులను అమ్మే దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చంద్రశేఖర్, వ్యవసాయ సంచాలకులు ఎల్లప్ప ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. స్టాకు రిజిస్టర్లను, ఎరువులను, బిల్లులను తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు, మందుల కొరత రాకుండా దుకాణదారులు ఎప్పటికప్పుడు మందులు సరఫరా చేయాలని కోరారు. పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అనుమతులు లేని పురుగు మందులను గమనించి సీజ్ చేశారు. వీటి విలువ రూ.89 వేలు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగలక్ష్మి, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కోటలో విద్యార్థుల సందడి



సిద్దవటం కోటలో సందడి చేస్తున్న విద్యార్థులు

సిద్దవటం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం కోటలో కడప నగరానికి చెందిన పబ్లిక్, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు సందడి చేశారు. మంగళవారం సిద్దవటం కోటను తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పబ్లిక్ స్కూల్ కోఆర్డినేటర్ అనిత మాట్లాడుతూ విద్యార్థులకు విహారయాత్రలో భాగంగా సిద్దవటం కోటలోని పురాతనమైన ఢంకానగర్, స్నానపు వాటిక, కోనేరు, రాణి మండపం, కామాక్షిదేవి ఆలయం, రెండు మండపాలు, మసీదు, ముఖద్వారం వంటి పురాతనమైన కట్టడాలను విద్యార్థులు తిలకించి వారి విశిష్టతపై విద్యార్థులకు తెలిపామన్నారు. పురావస్తుశాఖ అధికారులు స్పందించి పర్యాటకులకు కోటలోనే భోజనం తినే వసతులు ఏర్పాటు చేయాలని కోఆర్డినేటర్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిరాణా షాపులు తనిఖీ: ఎస్‌ఐ

సిద్దవటం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం, భాకరాపేట, వంతాటిపల్లె, జ్యోతి, జంగాలపల్లె గ్రామాల్లో ఉన్న కిరాణా షాపుల్లో ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఎస్‌ఐ మాట్లాడుతూ కడప ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలకు 100 కి.మీ పరిధిలో కిరాణా షాపుల్లో పొగాకు అమ్మకాలపై తనిఖీ చేశామన్నారు. ఒకవేళ ఎవరైనా పొగాకు సంబంధించిన గుట్కా, ఖైనీ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ అరెస్ట్ అప్రజాస్వామికం : ఏఐటీయూసీ

రాజంపేటటౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలపై విజయవాడలో ఆందోళన చేపడితే వారిని అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా మున్సిపల్ వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయడంలో వైఫల్యం చెందిందని ఆరోపించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న లయన్స్ సభ్యులు

వీరబల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో రాయచోటి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా లయన్ అధ్యక్షుడు శ్యామ్ మాట్లాడుతూ దాత వీరబల్లి వాస్తవ్యుడు నాగరాజ ఆర్థిక సహాయంతో సామగ్రి పంపిణీ చేసినట్లు తెలిపారు. సమాజ సేవకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్ రీజనల్ చైర్మన్ మహమ్మద్, కోశాధికారి మనోహర్‌రాజు, పాఠశాల సిబ్బంది రెడ్డెప్పరెడ్డి, శివరామరాజు, చెన్నకృష్ణ, నాగేంద్ర పాల్గొన్నారు.

ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం వారి సహకారంతో వికసిత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ డైరెక్టర్ రవిశంకర్‌రెడ్డి, రాజంపేట సీఐ కుళాయప్పలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత నేరాల వైపు చూడకుండా మంచి జీవితం వైపు అడుగులు వేయాలని పేర్కొన్నారు. అనంతరం డైరక్టర్ రవిశంకర్‌రెడ్డి, సీఐ కుళాయప్ప మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటనరసయ్య, మహిళా సాధికారిత విభాగం కోఆర్డినేటర్ పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

ఏజీ గార్డెన్‌కు ఎక్కిళ్లు!

- వారానికి ఒక్కసారి నీళ్ల సరఫరా
- నాలుగు బిందెల నీళ్లతో సర్దుకుపోతున్నాం..
- అరకొరగా వీధి లైట్లు
- ఒక్క సీసీ రోడ్డు కూడా లేదు ..
- ఇది జిల్లా కేంద్రంలోని ఓ కాలనీ దుస్థితి

రాయచోటి కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వారానికో సారి తాగునీరు సరఫరా చేస్తుండడంతో జిల్లా కేంద్రంలోని ఏజీ గార్డెన్ ఎక్కిళ్లు పడుతోంది. 2013లో ఏర్పడిన ఈ కాలనీలో దాదాపు 100కు పైగా కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ కాలనీ మునిసిపాలి టీ పరిధిలోకి వస్తుందా.. గొర్లముదివేడు గ్రామం చెర్లోపల్లిలోకి వస్తుందా అనే సందిగ్ధంతో సుమారు పదేళ్ల పాటు అభివృద్ధి కుంటుపడింది. 2022లో ఈ కాలనీ మున్సిపాలిటీలోకి వస్తుందని అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి రాయచోటి మున్సిపాలిటీ వారు ట్యాంకర్ల ద్వారా నీరు సప్లై చేస్తున్నామని చెబుతున్నారు. అయితే, వారానికి ఒక్కసారి మాత్రమే తాగు నీరు అందుతోందని, ఈ ట్యాంకర్లు ఎప్పుడొస్తాయో తెలియక రాత్రింబవళ్లు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని


కాలనీలోని మట్టి రోడ్డు

కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ఇంటికి కేవలం నాలుగు బిందెలు మాత్రమే ఇస్తున్నారని, ఈ నీళ్లతో వారమంతా సర్దుకుంటున్నామని చెబుతున్నారు. ఇలా కాకుండా ఈ కాలనీలో ఒక బోరు వేస్తే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు.

భయం భయంగా బతుకుతున్నాం

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఏజీ గార్డెన్ కాలనీలో వీధి లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో భయం భయంగా బతుకుతున్నామని, సాయంత్రం 6 దాటితే చిన్నపిల్లలు, ఆడవారు బయటికి రాకుండా ఇళ్లకే పరిమితం అవుతున్నారని కాలనీవాసులు చెబుతున్నారు. దాదాపు పదేళ్లుగా నరకం అనుభవిస్తున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎన్నోసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా, అరకొరగా లైట్లు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప శాశ్వతమైన పరిష్కారం చూపడం లేదని అంటున్నారు. ఇంత పెద్ద కాలనీలో కనీసం ఒక్క సీసీ రోడ్డు


నీళ్ల కోసం స్థానికులు ఏర్పాటు చేసుకున్న డ్రమ్ములు

కూడా వేయకపోవడం చాలా దారుణమని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఏజీ గార్డెన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎగువకాలనీ మా పరిధిలోకి రాదు

ఏజీ గార్డెన్‌లో దిగువ కాలనీ మా పరిధిలోకి వస్తుంది. ఎగువ కాలనీ మా పరిధిలోకి రాదు. ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరా విషయం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడగండి. ఆ కాలనీ మొత్తం చెర్లోపల్లి పంచాయతీలోకి వస్తుంది. అయినా నీరు సరఫరా చేస్తున్నాం.

- వాసుబాబు, మున్సిపల్ కమిషనర్

త్రైయేరియాసిస్ టీకాలు వేయించండి

- జేడీఏహెచ్ గుణశేఖర్ పిళ్లై


టీకా కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జేడీ గుణశేఖర్ పిళ్లై

కలకడ, జూలై 15(ఆంధ్రజ్యోతి): పాడి పశువుల్లో త్రైయేరియా సిస్ వ్యాధి నివారణకోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న టీకా శిబి రాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ జేడీ గుణశేఖర్ పిళ్లై సూచించారు. కలకడ మండలం పొత్తూరివారి పల్లెలో త్రైయేరియాసిస్ వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పాడి ఆవులకు తీవ్రమైన జ్వర లక్షణాలుంటాయని తెలిపారు. దీని ప్రభావంతో పాల ఉత్పత్తి తగ్గి రైతుల ఆదాయానికి గండి పడుతుందన్నారు.

జిల్లాలోని పశుకేంద్రాల్లో 18 వేల డోసుల టీకాలు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. టీకా లక్ష్య సాధనలో రాష్ట్ర స్థాయి లో జిల్లా మూడవ స్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణయ్య, శివారెడ్డి, లోకేశ్, తేజకల్యాణ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీమా ప్రీమియం చెల్లించండి : జేడీఏ


రైతులతో మాట్లాడుతున్న జేడీఏ శివనారాయణ

చిన్నమండెం, జూలై15(ఆంధ్రజ్యోతి): వేరుశనగ సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.567 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని జేడీఏ శివ నారాయణ సూచించారు. మంగళవారం కొత్త పల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వర్షాభావం నేపథ్యంలో రాగి, ఉద్దులు, పెసర, కంది వంటి పంటలను సాగు చేయాలని రైతులకు వివరించారు.ఎంఏవో రమేశ్‌రాజు, బీ. గీతా, ఆర్‌ఎస్‌కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తి అరెస్ట్


నిందితుడితో అటవీశాఖ సిబ్బంది

సిద్దవటం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణులను వేటాడిన కేసులో గోపవరం మండలం వెంకటరామాపురం గ్రామానికి చెందిన బొడిమిగుంట రమణయ్యను అరెస్ట్ చేసినట్లు సిద్దవటం అటవీ శాఖ క్షేత్ర అధికారి కళావతి తెలిపారు. మంగళవారం స్థానిక అటవీ కార్యాలయంలో ఆమె వివరాలు వెల్లడించారు. సోమవారం సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధిలోని అట్లూరు మండలం చెల్లంగారిపల్లె సమీపంలోని పెనుశిల లక్ష్మీనరసింహ అభయారణ్యంలో ముగ్గురు వ్యక్తులు నాటు తుపాకీతో కొండగొర్రెను వేటాడి, మాంసాన్ని వండుకుని తింటుండగా దాడులు చేసి రమణయ్య అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో ఇద్దరు పారిపోయారని తెలిపారు. పారిపోయిన వ్యక్తులు అట్లూరు మండలం చల్లంగారిపల్లెకు చెందిన గుమ్మల వెంకటసుబ్బయ్య, గుమ్మల శ్రీనుగా గుర్తించామన్నారు. వీరి కోసం విస్తృతంగా గాలిస్తున్నట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఆరు వన్యప్రాణుల కాళ్లు, వండిన మాంసం కత్తులు, టార్చిలైట్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు చేయించి సిద్దవటం కోర్టులో హాజరుపరిచామని వివరించారు. వన్యప్రాణులను వేటాడినా, హానితలపెట్టిన చట్టాలు చాలా తీవ్రంగా ఉన్నాయని, ప్రతిఒక్కరూ వన్యప్రాణుల సంరక్షణకై పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి యువకుడి ఆత్మహత్య


చౌడప్ప మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆస్పత్రి అవుట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం, రామాపురానికి చెందిన వెంకటరమణ కుమారుడు చౌడప్ప (30) బి.కొత్తకోట మండలం, కనికలతోపు వద్ద ఉంటూ, టాటా ఏస్‌లో నీళ్ల సరఫరా చేస్తూ జీవిస్తున్నాడు. సంపాదించిన డబ్బంతా వివాహేతర సంబంధాలకు ఖర్చు చేస్తున్నావంటూ అతని భార్య కనకలక్ష్మి మందలించడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడిఉన్న యువకుడిని కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బి. కొత్తకోట పోలీసులు తెలిపారు.

ప్రియురాలు మాట్లాడలేదని..


జయపాల్‌నాయక్ మృతదేహం

రాజంపేట టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాను ప్రేమించిన యువతి ఫోన్‌లో మాట్లాడలేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం వెంకటపల్లె తాండాకు చెందిన బాల్యా జయపాల్‌నాయక్(19) మోటారు మెకానిక్‌గా పని చేస్తూ రాజంపేట పట్టణంలోని మన్నూరులో నివాసం ఉంటున్నాడు. ప్రేమించిన యువతి ఫోన్‌లో మాట్లాడలేదని మనోవేదనకు గురై, సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి


మృతి చెందిన మల్లికార్జున

మదనపల్లె అర్బన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు కింద పడి ఓ యాచకుడు మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు మొలకల చెరువు మండలం, బురకాయలకోటకు చెందిన గోవిందు కుమారుడు మల్లికార్జున (23)కు మతిస్థిమితం లేదు. కొంతకాలంగా ఇతను మదనపల్లెలో భిక్షాటన చేస్తూ కడుపు నింపుకునేవాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో టిప్పు సుల్తాన్ కాంప్లెక్స్ వద్ద కూర్చుని ఉన్న అతను హఠాత్తుగా రోడ్డుపైకి రావడంతో మదనపల్లె నుంచి గాలివీడుకు వెళుతున్న ఆర్టీసీ వన్ డిపో బస్సు వెనుక చక్రం ఢీకొంది. దీంతో రోడ్డుపై పడి తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసులు, ఆర్టీసీ వన్ డిపో అసిస్టెంట్ మేనేజరు రేవతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మమృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తామని వన్‌టౌన్ సీఐ ఎరిసావలి విచారించి తెలిపారు.

'బాబుగారూ.. తెలంగాణ ట్రాప్‌లో పడొద్దు'

వేంపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుపై బుధవారం ఢిల్లీలో కేంద్ర జనవరుల శాఖ మంత్రి పీఆర్ పాటిల్ నేతృత్వంలో జరగబోయే సమావేశంలో తెలంగాణ ట్రాప్‌లో పడవద్దని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సలహా ఇచ్చారు.మంగళవారం ఆయన వేంపల్లెలో పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ఆచరణసాధ్యం కాదని మ్యాప్ ద్వారావిలేకరులకు వివరించారు. గోదావరిలో మిగులు జలాలు ఎక్కువగాఉన్నాయని, కొన్ని మేము వాడుకుంటాం కొన్నిమీరు వాడుకోండని తెలంగాణకు బాబు సూచించడం అవగాహనరాహిత్యమన్నారు.

గణితంపై భయాన్ని పోగొట్టాలి

- విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి
- డీఈవో సుబ్రమణ్యం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కే. సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జూలై15(ఆంధ్రజ్యోతి): గణితంపై విద్యార్థులకు ఉండే భయాలను పోగొట్టడానికి గణితం క్లబ్బులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం సూచించారు. మంగళవారం మధ్యాహ్నం డైట్ అధ్యాపకులు శివభాస్కర్, కేదార్‌నాథ్ ఆఃధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామానుజన్ మ్యాథ్స్ క్లబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మరింత ఆసక్తికంగా, అర్థమయ్యేలా సరళ పద్ధతిలో బోధించడానికి గణిత ఉపాధ్యాయులు నూతన విధానాలను అనుసరించాలన్నారు. ఇందుకు గణిత ఆటలు, పజిల్స్ క్విజ్‌లు వంటివి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయ న్నారు. గణితశాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వంటి వారి జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని సమస్య పరిష్కార నైపుణ్యాలు తార్కిక ఆలోచన, విమర్శనాత్మక ఆలోచన వంటి వాటిని విద్యార్థుల్లో పెంపొందించాలన్నారు. అనంతరం డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు మాట్లాడుతూ డైట్ ఒక ప్రయోగశాలగా బోధనాభ్యసనలో వినూత్న విధానాలను రూపొందిస్తోందన్నారు. మెరుగైన ఫలితాల సాధన దిశగా డైట్ అధ్యాపకులు కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి జనార్దన్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రనాథ్ బాబు, అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి, వైసీ రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఉర్దూ విద్య'ను బలోపేతం చేయండి

- విద్యాశాఖ మంత్రికి రూటా నేతల వినతి

రాయచోటిటౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉర్దూ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని ఉర్దూ అంగన్వాడీల స్థాయి నుంచి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఒక కార్యాచరణ ప్రకటించి అభివృద్ధి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ ముస్తాక్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మెగా డీఎస్సీలో ఉన్నతీకరించిన పాఠశాలలు, మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు చూపించలేదని, వెంటనే ఆ స్థానాల్లో అర్హులైన ఉర్దూ మీడియం విద్యా వలంటీర్లను నియమించాలని వారు కోరారు. 1997, 2000 సంవత్సరాల్లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ, రోష్ని పథకం కింద దాదాపు 210 ఉర్దూ ప్రాథమిక పాఠశాలలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్థాపించి ఉర్దూ విద్యా రంగానికి జీవం పోశారని గుర్తు చేశారు. ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేసి అవసరమైన ప్రాంతాల్లో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలన్నారు. జిల్లాల్లోని దాదాపు 520 ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠశాలల్లో చదువుకుంటున్న ముస్లిం మైనారిటీ విద్యార్థులు ఉర్దూ మొదటి భాషగా చదవడానికి వీలు కల్పించాలని, అందుకు అనుగుణంగా ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని కోరారు.

ఉర్దూ అంగన్వాడీలు స్థాపించాలన్న ముస్లిం మైనార్టీల దశాబ్దాల కల నేటికీ తీరలేదన్నారు. కోరుతున్నా అది నేటికీ జరగలేదని, ముస్లిం మైనార్టీల జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉర్దూ అంగన్వాడీలు స్థాపించి చరిత్రలో నిలిచిపోవాలని వారు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన నిర్వహిస్తున్న ఉర్దూ డిపార్టుమెంట్‌ను శాశ్వతంగా నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని, అవసరమైన ఉర్దూ ఆచార్యుల పోస్టులు మంజూరు చేసి ఉర్దూ భాషాభివృద్ధికి పాటుపడాలని వారు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తాళ్లపాకలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక గ్రామంలో సుమారు 9 రోజులుగా జరుగుతున్న చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో చెన్నకేశవ, సిద్దేశ్వర స్వాములకు వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలతో అభిషేకం చేశారు.


కొలువు దీరిన సిద్దేశ్వర చెన్నకేశవ స్వాములు

వృద్ధురాలి హత్య కేసులో ఇద్దరి అరెస్టు

పెద్దమండ్యం, జూలై 15(ఆంధ్రజ్యోతి) మండలంలోని దిగువపల్లికి చెందిన నల్లమ్మ(79) హత్య కేసులో భాగ్యమ్మ, నాగేంద్రనాయుడులను మంగళవారం మండలంలోని బండ్రేవు సమీపంలో అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు తెలిపారు. దిగువపల్లి కి చెందిన లక్ష్మయ్య, నల్లమ్మ దంపతులకు నలుగురు కొడుకులు, ఒక కూతురు ఉండగా, అందరికీ వివాహాలయ్యాయి. తండ్రి లక్ష్మన్న మృతి చెందడంతో నల్లమ్మను నెలకు ఒకరు పోషించేలే కొడుకులు తీర్మానించుకున్నారు. ఈ క్రమంలో కొడుకు ఆర్. చంద్రశేఖర్‌నాయుడు వంతు రాగా జూలై 1న వారి ఇంటికి నల్లమ్మ వెళ్లింది. ఈ వ్యవహారం ఇష్టం లేని చంద్రశేఖర్ నాయుడు భార్య భాగ్యమ్మ తరుచూ గొడవ పడేది. ఈ నెల 10న చంద్రశేఖర్‌నాయుడుతో భాగ్యమ్మ గొడవ పడింది. అత్త నల్లమ్మను ఇంటి నుండి తరిమి వేయాలన్న ఉద్దేశంతో రాయచోటిలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుకుంటున్న కొడుకు నాగేంద్రనాయుడుకు ఫోన్ చేసి ఇంటికి రప్పిచ్చింది. ఈ గొడవలకు కారణం నాయనమ్మ నల్లమ్మేనంటూ కొడుకును రెచ్చగొట్టింది. ఆదే రోజు సాయంత్రం నల్లమ్మతో భాగమ్మ గొడవ పడుతున్న సమయంలో నాగేంద్రనాయుడు నల్లమ్మ (79) తలకు వెనక భాగంలో ఇటుక రాయితో దాడి చేశాడు. ఛాతీపై కూర్చొని పిడిగుద్దులు గుద్దడంతో ఆమె స్పృహ కోల్పోయింది. విషయం గమనించిన సమీప బంధువులు 108 వాహనంలో తంబళ్లపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడడంతో తిరుపతి రుయా అసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ 11వ తేదీ రాత్రి మృతి చెందింది. 12వ తేదీ శనివారం నల్లమ్మ మనుమడు రాజశేఖర్ నాయుడు పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు భాగ్యమ్మ, నాగేంద్రనాయుడు ఇద్దరిపై హత్య కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మంగళవారం నిందితులను అరెస్టు చేసి తంబళ్లపల్లి కోర్టుకు తరలించింగా, రిమాండ్‌కు ఆదేశించినట్లు పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

డ్రిప్పు, స్ప్రింకర్లకు సబ్సిడీ


మాట్లాడుతున్న ఏడీఏ శ్రీలత

సుండుపల్లె, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ ధరలపై డ్రిప్పులు, స్ప్రింక్లర్లు ఇస్తున్నట్లు మైక్రో ఇరిగేషన్ పీడీ సాయిప్రసన్న తెలిపారు. సుండుపల్లె-3 పరిధిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్రిప్‌లు 90 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు 50 శాతం సబ్సిడీతో అందజేస్తున్నట్లు తెలిపారు. కావలసిన వారు రైతు సేవా కేంద్రాల్లో నగదును చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైతుల ఆర్థిక అభివృద్ధికి వ్యవసాయ తోడ్పాటుకు దోహదపడుతుందన్నారు. పంటలు సాగు చేసిన రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు శ్రీలత తెలిపారు. మంగళవారం సుండుపల్లె-3 రైతు సేవా కేంద్రం లోఆమె మాట్లాడుతూ వరి, వేరుశనగ, టమోటా సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలన్నారు. దీంతో ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాలకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుందన్నారు. కౌలు రైతులను గుర్తించి వీఆర్‌వో లాగిన్‌లో నమోదు చేయాలని, రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏ ఏ పంటలు సాగు చేస్తున్నారనే విషయాలను నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ పాస్‌పోర్టు కేసులో ప్రాసిక్యూషన్‌కు అనుమతి

కలికిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ పాస్‌పోర్టు వ్యవహారానికి సంబంధించి సుండుపల్లె పోలీసు స్టేషన్‌లో నమోదయిన కేసులో నిందితునిపై ప్రాసిక్యూషన్‌కు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాస్‌పోర్టు విషయంలో అబ్దుల్ సలాం కుమారుడు ఎస్.అజమ్‌తుల్లా మోసానికి పాల్పడినట్లు సుండుపల్లె పోలీసు స్టేషన్‌లో 2022లో నమోదయిన కేసులో పాత ఐపీసీ ప్రకారం 420 (కొత్త చట్టం ప్రకారం సెక్షన్ 318(4) భారతీయ న్యాయ సంహిత-2023), ఇండియన్ పాస్‌పోర్ట్ యాక్ట్-1967లోని సెక్షన్ 12(1)(ఎ)(బి)ల కింద అభియోగాలు నమోదయ్యాయి. నిందితుడు ఈ వ్యవహారంలో నేరపూరిత ప్రయత్నాలు చేసినట్లు నిర్ధారణ అయినందున అతన్ని ప్రాసిక్యూషన్ చేసేందుకు ప్రభుత్వం నుంచి రాష్ట్ర డీజీపీ అనుమతి కోరారు. ఈ మేరకు తగిన అనుమతులు జారీ చేస్తూ రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తదితరులు

రాజంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి సమీపంలోని బోయనపల్లె ఆర్టీవో కార్యాలయం సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తెలిపారు. నిందితులు ఒంటిమిట్ట మండలం చింతరాజుపల్లెకు చెందిన ఈశ్వరయ్య, రాజంపేట మండలం బోయనపల్లెకు చెందిన తోడేటి శేఖర్ నుంచి 2.150 కిలోల గంజాయిని, రెండు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇరువురిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలియజేవారు.

ఉప్పరాండ్లపల్లి సర్పంచు అరెస్టు

- చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన పర్యవసానం


పోలీసుల అదుపులో అయూబ్ బాషా

తిరుపతి(నేరవిభాగం), జూలై 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో.. అప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టిన కేసులో కడప జిల్లా ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచ్ షేక్ అష్రఫ్ అయూబ్‌బాషాను తిరుపతి సీఐడీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చక్రాయపేట మండలం ఉప్పరాండ్లపల్లికి చెందిన సర్పంచి షేక్ అష్రఫ్ అయూబ్ బాషా వైసీపీకి విధేయుడు. 2024లో తన ఫేస్‌బుక్ ఖాతాలో చంద్రబాబు, లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టాడు. అప్పట్లో చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పోలీసులకు దొరక్కుండా తిరుగుతున్నాడు. మంగళవారం నిందితుడు తిరుపతిలో ఉన్నట్లు సీఐడీ పోలీసులకు సమాచారం రావడంతో అతడి సెల్‌ఫోను నెంబరును ట్రాక్ చేసి అరెస్టు చేశారు. గుంటూరు సీఐడీ కోర్టులో హాజరుపరచనున్నట్లు సీఐడీ సీఐ రంగస్వామి చెప్పారు.

వాటర్ ప్లాంట్ల మూసివేత


మూతపడిన వాటర్ ప్లాంటు

- పంచాయతీ అధికారుల సమన్వయ లోపం
- ప్యూరిఫైడ్ వాటర్ కోసం జనం ఇక్కట్లు

పీలేరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రజలకు సురక్షిత తాగునీరు అందిస్తున్న 12 వాటర్ ప్లాంట్లు మూతపడ్డాయి. దీంతో ప్రజలు ప్రైవేటు వాటర్ ప్లాంట్‌లపై ఆధార పడాల్సి వస్తోంది. పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ అధికారుల సమన్వయ లోపం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు అందించడం కోసం పీలేరు పట్టణంలో 26 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. దీంతో ప్రతి రోజూ ఇంటికి ఒకటి లేదా రెండు క్యాన్లలో తాగు నీరు ఉచితంగా తెచ్చుకొనేవారు. కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ప్రస్తుతం వీటిలో 12 ప్లాంట్లు మూత పడడంతో క్యాన్‌కు రూ.20 వేలు చెల్లించే శక్తి లేక పేదలు, కూలీలు, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వాటర్ ప్లాంట్లలో పని చేస్తున్న 26 మంది వర్కర్లకు గత పది నెలలుగా జీతాలు ఇవ్వలేదు. దీంతో వారు పలు మార్లు పంచాయతీ ఈవో వద్దకు వెళ్లి జీతాలు ఇవ్వాలని పదేపదే వేడుకున్నారు. పలువురు వర్కర్లు పేద వారు కావడంతో ఒకనెల కాకపోయినా ఇంకోనెలలో ఇస్తారన్న ఆశతో పనిచేస్తున్నారు. తీరా పదినెలలు పెండింగ్ పెట్టడంతోపాటు, ఎప్పుడిస్తారో స్పష్టమైన హామీ ఈవో నుంచి రాకపోవడంతో ప్లాంట్లకు తాళాలు వేస్తున్నారు. జీతాలు చెల్లించకపోవడంతో రోజురోజుకూ మినరల్ వాటర్ ప్లాంట్ల పనితీరు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఉన్నవాటిలో ఇప్పటికే 12 మూతపడ్డాయి. మరి కొన్ని చోట్ల రెండ్రు రోజులకోసారి నీరు ఇస్తున్నారు. మూతపడ్డ ప్లాంట్లలో కొన్ని చోట్ల మోటార్లు చెడిపోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు.

కలెక్టర్ ఆదేశాల కోసం చూస్తున్నాం...



వాటర్ ప్లాంట్లలో పని చేస్తున్న వర్కర్లకు పది నెలల జీతాలు చెల్లించాలి. ఇందుకోసం పీలేరు ఎమ్మెల్యే కలెక్టర్‌కు లేఖ రాశారు. ప్రస్తుతం పని చేస్తున్న వర్కర్లకు పెండింగ్ జీతాలు ఇస్తేనే ప్లాంట్ల తాళాలు ఇస్తామంటున్నారు. ఇకపై పంచాయతీ వర్కర్లకు వాటర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. త్వరలోనే సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

-లతీఫ్‌ఖాన్, ఇన్‌చార్జి ఈవో, పీలేరు గ్రామపంచాయతీ.

పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● పీఎఫ్ ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలి ● మాజీ ఎమ్మెల్సీలు కత్తి, పోచంరెడ్డిల డిమాండ్


ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, పాల్గొన్న పెన్షనర్లు

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల ద్వారా ప్రజలకు సేవలందించిన పెన్షనర్ల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండికేయడం తగదని, వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్సీలు కత్తి నరసింహారెడ్డి, పోచంరెడ్డి సుబ్బారెడ్డిలు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా మంగళవారం పెన్షనర్లు కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పాలక ప్రభుత్వాలు వచ్చినప్పటికీ పెన్షనర్లకు న్యాయం చేయడంలో మీనమేషాలు లెక్కించడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లుతో పాటు ప్రవేశ పెట్టిన ఫైనాన్స్ వ్యాలిడేషన్ అమెండ్మెంట్‌ను రద్దు చేయాలన్నారు. 2018 జనవరి నుంచి డీఆర్ బకాయిలు రాలేదన్నారు. వైసీపీ పాలనలో పెన్షనర్లకు చేసిన మేలు శూన్యమన్నారు. మూడు విడతల పెండింగ్ డీఆర్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. పెనన్షనర్లకు సమగ్ర ఆరోగ్య బీమా పథకాన్ని ప్రవేశ పెట్టి, ఆసుపత్రులలో క్యాష్ లెస్ చికిత్సలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెన్నారెడ్డి, రామ్మూర్తి నాయుడులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్లపై చిన్న చూపు చూడడం తగదన్నారు. ఆర్టీసి బసుల్లో సీనియర్ సిటిజన్లకు టిక్కెట్లలో రాయితీలు ఇచ్చినట్లుగా రైల్వే, విమాన టిక్కెట్లలో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కమ్యూనిటేష్ రికవరీ కాలాన్ని 15 ఏళ్ల నుంచి 11 సంవత్సరాలకు తగ్గించాలని, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను తెలంగాణ రాష్ట్రంలో పెన్షనర్లకు ప్రకటించినవిధంగా మన రాష్ట్రంలో మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ ఎన్జీవో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ పెన్షనర్లకు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నేత పట్టాభి రామయ్య, నాగమునిరెడ్డి, కత్తి బ్రహ్మయ్య, దస్తగిరిరెడ్డి, రామసుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, దేవానంద్, శివరామిరెడ్డి, శ్రీని వాసరాజు, గానుగపెంట హనుమంతరావు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'గండి'లో నేడు టెండర్లు

చక్రాయపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడాది పాటు పూలు విక్రయించుకొనే హక్కు, టోల్‌గేట్ వసూలుకు సబంధించి హక్కులు కల్పించేందుకు, శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ, ఏర్పాట్లకు సంబంధించి ఇ-టెండరు/సీల్డ్ టెండరు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే స్థానిక గండి కార్యాలయంలో శ్రావణమాస ఉత్సవాలకు సంబంధించి పులివెందుల ఆర్డీఓ ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందన్నారు.

'అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి'

కడప రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జడ్పీ పరిధిలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందికి సంబంధించి 2023-24 ప్రావిడెంట్ ఫండ్ వివరాలను అంతర్జాలములో పొందురిచామని డిప్యూటీ సీఈవో సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ఏవైనా అభ్యంతరాలుంటే ఒక నెలలోపు రాత పూర్వకంగా కార్యాలయానికి తెలియజేస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్

జాతీయ వర్క్‌షాప్‌లో ప్రతిభ


స్కౌట్ మాస్టర్లను అభినందిస్తున్న డీఈఓ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నేషనల్ వర్క్ షాప్‌లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్ పాల్గొని చక్కటి ప్రతిభ కనబరిచారు. ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు దేశ రాజధాని న్యూఢిల్లీలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కెపాసిటి బిల్డింగ్ నేషనల్ వర్క్‌షాప్‌లో జిల్లాకు చెందిన స్కౌట్ మాస్టర్లు బి.ఖాదర్ బాష, సగినాల అహమద్, గైడ్ కెప్టెన్ వి.చంద్రవతి పాల్గొన్నారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో నాయకత్వ లక్షణాలతో పాటు అనేక సామాజికహిత కార్యక్రమాల గురించి వీరు వర్క్‌షాప్‌లో ప్రజెంటేషన్ చేశారు. క్యాంప్‌ను విజయవంతంగా పూర్తిచేసుకుని జిల్లాకు చేరుకున్నారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా చీఫ్ కమిషనర్ కం సెక్రటరీ, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ కలిసిన అనంతరం వారిని డీఈఓ అభినందించారు. వీరికి నేషనల్ వర్క్ షాప్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ కార్యశాలలో నేర్చుకున్న అంశాలను జిల్లాస్థాయిలో అమలు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో జిల్లాస్థాయిలో పలు శిక్షణ శిబిరాలు, టెస్టింగ్ క్యాంప్‌లు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని స్కౌట్ మాస్టర్స్, గైడ్ కెప్టెన్‌లు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిత్తూరు జట్టు ఘన విజయం

కడప స్పోర్ట్స్, జులై 15 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా కేఓఆర్ఎం మైదానంలో మంగళవారం ముగిసిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు కడప జట్టుపై ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది. వివరాలిలా..


కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల మధ్య గత మూడు రోజులుగా సాగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 38.4 ఓవర్లలో 139 పరుగులకే చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. అనంతరం ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 71.4 ఓవర్లలో 383 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టుకు 244 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 67 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 193 పరుగులు చేసింది. ఇందులో ఫైజాన్ 58 పరుగులు చేశారు. మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్‌తో బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు మంగళవారం 85 ఓవర్లలో 239 పరుగుకు ఆలౌట్ అయింది. దీంతో చిత్తూరు జట్టు ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో విజయం సాధించింది.

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పొడిగింపు

కడప కలెక్టరేట్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం జీవో జారీ చేసినట్లు సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం కింద రూ.1250లు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు, సీఎఫ్ఎంఎస్.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్ సైట్ ద్వారా చెల్లించి లబ్ధిపొందాలని సంచాలకులు తెలిపారు.

వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు కేసులో

డాక్టరుతో పాటు మరొకరు అరెస్టు



కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద వివాదాస్పద ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన కేసులో డాక్టరుతో పాటు ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమానిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 12న రాత్రి సుమారు 7 గంటల సమయంలో కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ వద్ద ఎంత పని సేచ్చివయ్యా జగనూ.. అని హెడ్డింగ్ పెట్టి 12 పాయింట్స్ కలిగిన ఒక బ్యానరును చెన్నై చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ నారపురెడ్డి నాగార్జునరెడ్డి, గ్లేస్ ఫ్లెక్సీ డిజిటల్ షాపు యజమాని అమృతరాజులు ఏర్పాటు చేశారన్నారు. ఈ బ్యానర్‌ను పరిశీలించగా అందులో రెండు రాజకీయ పార్టీల మధ్య చిచ్చు పెట్టి ఘర్షణ వాతావరణం సృష్టించి ప్రజాశాంతికి మరియు లా అండ్ ఆర్డరుకు భంగం కలిగించే విధంగా ఉంది. దీనిపై వచ్చిన రాతపూర్వక ఫిర్యాదు మేరకు క్రైం నెం: 148-2025, యు-ఎస్ 61(2) 325 ఆర్‌డబ్ల్యు, 3(5) బీఎన్ఎస్ మేరకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో వారివురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఇరువురిని మంగళవారం మధ్యాహ్నం అరెస్టు చేసి, అనంతరం కోర్టులో హాజరు పరిచామన్నారు. ఎవరైనా వాక్ స్వాతంత్య్రపు హక్కును దుర్వినియోగం చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పద అంశాలు కలిగిన బ్యానర్‌లను తయారు చేయకూడదని ఫ్లెక్సీ ప్రింటింగ్ తయారీ యజమానులకు డీఎస్పీ సూచించారు. అలాంటి అంశాలు కలిగిన బ్యానర్లు తయారు చేయాలని మీ వద్దకు వస్తే వెంటనే సంబంధిత పోలీసుస్టేషన్‌కు తప్పకుండా తెలిపాలన్నారు. బ్యానర్ కింద ప్రింటింగ్ ప్రెస్ పేరు, ఫోన్ నెంబరును తప్పకుండా ముద్రించాలన్నారు.

మహిళ ఆత్మహత్య


సువార్తమ్మ మృతదేహం

ఎర్రగుంట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కలమల్ల క్రిష్ణానగర్‌కు చెందిన లక్కానిపల్లి సువార్తమ్మ(35) ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు... డ్వాక్రా సంఘం నుంచి సువార్తమ్మ రూ.2లక్షలు రుణం తీసుకుంది. దీన్ని ఆమె కుమారుడు వెంకటేష్ తీసుకున్నాడు. అయితే డ్వాక్రా రుణం డబ్బులు చెల్లించాలని కుమారుని అడుగగా లేవని చెప్పడంతో మనస్థాపం చెందిన ఆమె సోమవారం రాత్రి ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వారు ఆమెను ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించింది. కలమల్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి... కేసు నమోదు

కాశినాయన జూలై 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని బాలాయపల్లె గ్రామానికి చెందిన వడ్డెపోగు ఓబయ్యపై దాడి చేసిన సంఘటనలో ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. గత ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి బాలాయపల్లెకు వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్, బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితీష్‌రెడ్డి లకు ఎస్సీకాలనీలో అంగన్వాడీ భవనం, తాగునీటికి పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయాలని వడ్డెపోగు ఓబయ్య అర్జీ ఇచ్చారు. కాలనీలోని ప్రభుత్వ భూమిలో మేకల దొడ్డికట్టుకున్న కొమ్మునూరు బాగ్యరాజు తన మేకల దొడ్డిని ఎక్కడ ఖాళీ చేయించి అంగన్వాడీ సెంటర్ నిర్మిస్తారోనని అనుమానించాడు. దీంతో తన తమ్ముడు యోహాన్ కుమారుడు కార్తీక్‌తో కలసి మంగళవారం ఉదయం ఓబయ్యపై అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

యూసీఐఎల్‌లో ప్రమాదం.. వ్యక్తికి గాయాలు



వేముల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్‌లో పనులు నిర్వహిస్తున్న ఎస్ఎమ్ఎస్ కంపెనీ సబ్ కాంట్రాక్ట్ నంది కంపెనీలో మేట్‌గా పని చేస్తున్న అబ్దుల్లా ప్రమాదానికి గురయ్యారు. వివరాల్లో వెళితే ... పులివెందుల మండలం బ్రాహ్మణపల్లెకు చెందిన అబ్దుల్లా మంగళవారం మధ్యాహ్నం మైన్ లోకి పనికి వెళ్లాడు. ఎక్స్‌కవేటర్‌తో పని చేయిస్తుండగా ఆపరేటర్ పొరపాటున వాహనాన్ని కదిలించాడు. దీంతో వెనుక ఉన్న అబ్దుల్లా మోకాలుకు తగలడంతో కాలు విరిగింది. వెంటనే పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వైవీయూలో డిగ్రీ కోర్సులకు ప్రవేశాలు


మాట్లాడుతున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలిపారు. మంగళ వారం ప్రిన్సిపాల్ చాంబర్‌లో పలువురు డీన్‌లతో కలిసి సమా వేశమయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం-2020ని ప్రతిష్టాత్మకంగా అమలు చేయడంలో భాగంగా బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్స్ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్, ఎర్త్ సైన్స్ కోర్సులలో త్వరలో ప్రవేశాలు కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఈ కోర్సులు చదవడం ద్వారా భవిష్యత్తు ఆధారిత విద్య లభించడంతో పాటు ఎంచుకున్న రంగంలో లోతైన నైపుణ్యాన్ని గడిస్తారన్నారు. తద్వారా గ్రాడ్యుయేట్‌లను జాబ్ మార్కెట్‌కు సరిపడా జ్ఞాన స్కిల్ పొంది సమాజ భవిష్యత్తు అవసరాలు తీర్చగల పౌరులుగా తయారవుతారన్నారు. బీఎస్సీ (హానర్స్) ఫిజిక్స్‌తో పాటు బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, నానో- సైన్స్, కంప్యూటేషనల్ ఫిజిక్స్, డేటా సైన్స్, ఫిజిక్స్, టెక్నాలజీ విద్యార్థి ఎంపిక చేసుకొని చదివే అవకాశం ఉందన్నారు. బీఎస్సీ (హానర్స్) రసాయన శాస్త్రం మేజర్ సబ్జెక్టుగా తీసుకోవడంతో పాటు అప్లికేషన్ కెమికల్ సైన్స్, కంప్యూటేషనల్ కెమిస్ట్రీ, మెటీ రియల్ సైన్స్ చదవచ్చన్నారు. బీకాం (హానర్స్) కంప్యూటర్ సైన్స్‌ను ప్రధాన అంశంగా కలిగి ఉందన్నారు. బిజినెస్ కామర్స్, కంప్యూటర్ సైన్స్ ఫైనాన్షియల్ టెక్నాలజీ ఇన్ఫర్మేషన్ సిస్టం మేనేజ్‌మెంట్ వంటి అంశాలలో బలమైనపునాది వేసే అవకాశం విద్యార్థికి లభిస్తుందన్నారు. నాలుగేళ్ల హానర్స్ కోర్సు ఉత్తమ మార్కులతో పూర్తిచేస్తే నేరుగా రీసెర్చ్‌లో ప్రవేశించే అవకాశం ఉందన్నారు. వైవీయులో వినూత్నమైన కోర్సులు, అత్యాధునిక ల్యాబ్‌లు, నిష్ణాతులైన, ప్రపంచస్థాయి గుర్తింపుపొందిన పరశో,దకులు, అంకితభావం కలిగిన అధ్యాపక బృందం ఉందన్నారు. సమావేశంలో పూర్వ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ ఎస్.రగునాథరెడ్డి, డీన్ ఫర్ అకడమిక్ అఫైర్స్ చంద్ర ఓబుళరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ టి.లక్ష్మీప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

● రూ.21.28 లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల


పులివెందులలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పులివెందుల రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్‌శాఖ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు తనిఖీలు చేపట్టారు. పలు దుకాణాలలో ఎరువుల అమ్మకాలను నిలిపివేస్తూ నోటీసులు ఇచ్చారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వలు, ప్రత్యక్ష వినియోగం బదిలీ మిషన్ ద్వారా అమ్మకాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఓ దుకాణంలో ఫారం-ఓ నమోదు కాని ఎరువులు, అనుమతి ఫారాలు లేని సుమారు రూ.5.92 లక్షల విలువైన ఎరువులు, మరో ఫర్టిలైజర్స్ దుకాణంలో వివిధ కారణాలతో సుమారు రూ.15.36లక్షల విలువైన ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ వ్యవసాయాధికారి గోవర్దన్, మండల వ్యవసాయ అధికారి చెన్నారెడ్డి, టెక్నికల్ వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు మండలంలో...

ముద్దనూరు జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు తనిఖీ చేశారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు, కర్నూలు జిల్లా డీఆర్సీ ఏడీఏలు వెంకటేశ్వర్లు, కడప జేడీఏ టెక్నికల్ ఏవో గోవర్ధన్ ఎరువుల దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్లు, గోడౌన్‌లో నిల్వ చేసిన ఎరువులను పరిశీలించారు. లైసెన్స్ లేకుండా వ్యాపార లావాదేవీలు సాగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేరాలు, బెయిల్ మంజూరుపై సమీక్ష


వర్చువల్ పద్ధతిలో రివ్యూ చేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కాంపౌండబుల్ నేరాలు, ఖైదీల బెయిల్ మంజూరుపై మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి తన చాంబర్‌లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని కోర్టు ద్వారా బెయిల్ మంజూరు, కాంపౌండబుల్ నేరాలు, సెక్షన్ 479 బీఎన్ఎస్ఎస్, సెక్షన్ 436ఏ సీఆర్‌పీసీ, 479 బీఎన్ఎస్ఎస్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్, కడప, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ, కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ, పురుషుల, మహిళ కేంద్ర కారాగారాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి, పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే చర్యలు తప్పవు

● 30 మందిపై కేసు నమోదు

పులివెందుల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి, పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని అర్బన్ సీఐ చాంద్‌బాష పేర్కొన్నారు. 'సేవ్ క్యాంపస్' పేరిట మంగళవారం ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలతో డీఎస్పీ మురళీ నాయక్ సూచనల మేరకు పొగాకు ఉత్పత్తులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో సిగరెట్లు, బీడీలు తాగవద్దన్నారు. పోలీసుల హెచ్చరిక కాదని బహిరంగ ప్రదేశాలలో వీటిని వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పలు దుకాణాల్లో, బహిరంగ ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో బహిరంగ ప్రదేశాలలో సిగరెట్లు, బీడీలు తాగే 30మందిపై కేసు నమోదు చేశామన్నారు. వీరిపై రూ.6వేలు జరిమానా విధించామని తెలిపారు.

బీజేపీ నేత కందుల మురళీమోహన్‌రెడ్డిపై దాడి


దాడిలో గాయపడిన కందుల మురళీమోహన్‌రెడ్డి

కడప క్రైం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజా రెడ్డివీధిలో కందుల రాజమోహన్‌రెడ్డి తనయుడు, బీజేపీ నేత కందుల మురళీమోహనరెడ్డిపై కేఎస్ఆర్ఎం కళాశాల గ్రూప్ చైర్మన్ కందుల చంద్ర ఓబులరెడ్డి అలియాస్ నాని తన అనుచరులతో దాడి చేసి గాయపరిచినట్లు వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. రాజారెడ్డి వీధిలోని కందుల రెసిడెన్షియల్‌లో కింద ఫ్లోర్‌లో కందుల మురళీమోహన్‌రెడ్డి నివాసం ఉంటున్నారు. అదే అపార్ట్‌మెంటులోని పై అంతస్తులో చంద్ర ఓబుల్‌రెడ్డి ఉంటున్నారు. అయితే సాయంత్రం మురళీ మోహన్‌రెడ్డి తన పెద్దమ్మతో మాట్లాడుతున్న సమయంలో చంద్ర ఓబుల్‌రెడ్డి తన అనుచరులతో వచ్చి దాడి చేసి గాయపరిచాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆయనను రిమ్స్‌కు తరలిం చినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు చంద్ర ఓబుల్‌రెడ్డి అలియాస్ నానిపై 323, 341, 34 రెడ్‌విత్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా బాధితుడు మురళీ మోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాను తన పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఆస్తి పంపకాల గురించి మాట్లాడుతున్న సమయంలో చంద్ర ఓబుల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి దాడి చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ముగిసిన కలికిరి యల్లమ్మ జాతర


పూజలు అందుకుంటున్న యల్లమ్మ తల్లి

కలికిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన గ్రామ దేవత యల్లమ్మ తల్లి నాలుగు రోజుల జాతర మంగళవారంతో ముగిసింది. ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణలో పార్వేట ఉత్సవం నిర్వహించారు. సాయంకాలం సంప్రదాయ రీతిలో కళ్లిపాటు ఏర్పాటు చేశారు. సర్వాంగసుందరంగా అలంకరింపబడిన అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ మధ్యలో యల్లమ్మ తన సోదరి అంకాలమ్మ, సోదరుడు పోతురాజుతో కలిసి వన విహారం చేశారు. వన విహారం సందర్భంగా అమ్మవార్లకు శాంతి పూజలు నిర్వహించారు. ఉగ్రరూపంలో వున్న అమ్మవారిని శాంతింపజేయడానికి మేకపిల్లను బలి పెట్టారు. అనంతరం రాత్రి ఆలయం ఆవరణలోని నాలుగు మండపాల ఆస్థానంలో అమ్మవారిని ఆశీనురాలిని చేసి కథాకాలక్షేపం నిర్వహించారు. సాయం సంధ్య వేళ భక్తులను ఆవహించిన అమ్మవారు గ్రామానికి సంబంధించిన భవిష్య వాణి వినిపించారు. అన్ని రకాల సంప్రదాయాలు పూర్తయిన అనంతరం నాలుగు రోజులుగా నిరంతరం తెరిచే వుంచిన గర్భగుడి ద్వారాలను మూసివేస్తారు. ఇంతటితో జాతర ముగిసినట్లు ప్రకటించారు. కాగా అమ్మవారి జాతరను విజయవంతం చేసినందుకు సహకరించిన వారందరికీ ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా ఆషాఢమాస పూజలు


శివాలయంలో విశేష పూజలందుకుంటున్న కామేశ్వరస్వామి, శాకంబరి అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

వాల్మీకిపురం, జూలై 15(ఆంధ్రజ్యోతి): బజారువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం ఆషాఢమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అమ్మవారికి అభిషేకం, అర్చన, తోమాల, శాకంబరి అలంకారం, (కూరగాయలతో) అలంకరణలు గావించి పూజలు నిర్వహించారు. స్థానిక కోనేటివీధిలోని శివాలయంలో లక్ష్మీకామేశ్వరస్వామి దేవతా మూర్తులకు అభిషేకాలు, అలంకరణలు, రుద్రాభిషేక అలంకరణలతో భక్తజనం నడుమ వైభవంగా పూజలు జరిగాయి. ఈసందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్న వితరణ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయాల ధర్మకర్తలు కువైట్ శంకరాచారి, తబ్బుల సతీష్, అర్చకులు గోనవరపు శీనాస్వామి, అలంకార్ భట్టార్, సుధీర్‌స్వామి, వాసవీ ఆలయం ప్రధాన అర్చకులు శీనాస్వామి, రమేష్‌బాబు, వాసవి మహిళా మండలి సభ్యులు, భక్తులు, పాల్గొన్నారు.

అంకాళమ్మకు 'సమరసత' సారె

పీలేరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం సందర్భంగా పీలేరులోని సమరసత ఫౌండేషన్ సభ్యులు గ్రామ దేవత రౌద్రాల అంకాళమ్మకు మంగళవారం సారె సమర్పించారు. స్థానిక ఆర్టీసీ నల్లగుట్ట, మోడల్ కాలనీ ప్రాంతాల నుంచి సమరసత ఫౌండేషన్ సభ్యులు శాస్త్రోక్తంగా సారె తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆ ఫౌండేషన్ జిల్లా మహిళా కన్వీనర్ మద్యాల సత్యకుమారి, మండల కన్వీనర్ చెంగమ్మ, రమాదేవి, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు



మదనపల్లె అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డు, కోర్టు ఆవరణలో వెలసిన కోర్టులో గంగమ్మకు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో వేపాకులు, పూల తోరణంతో గంగమ్మను అలంకరించారు. మహిళలు ఆలయం చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను సభ్యులు పర్యవేక్షించారు.
సమస్యలను పరిష్కరించుకుందాం

కమిటీల ద్వారా సమస్యను పరిష్కరించుకుందాం

పెద్దతిప్పసముద్రం జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రుల అభివృద్ధి కమిటీల ద్వారా సమస్యలను పరిష్కరించుకుందామని మెడికల్ ఆఫీసర్ మహ్మద్ ఎస్థానీ సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో పీటీఎం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీలను నియమించినా కమిటీ సమావేశాలను నిర్వహించిన పాపాన పోలేదన్నారు ఆస్పత్రుల అభివృద్ధి కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ నిధులను కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రి అభివృద్ధి కమిటీలతో సమన్వయం లేక పోవడంతో అభివృద్ధి కుంటుబడిందన్నారు. ఇక్కడ పని చేసిన డాక్టర్ పురుషోత్తం నాయక్ బదిలీపై వెళ్లిపోగా మెడికల్ ఆఫీసర్ మహ్మద్ ఎస్థానీ బాధ్యతలు చేపట్టారు. డాక్టర్‌గా నదీయబేగం ఇటీవలే కొత్తగా వచ్చారు. ఇందులో భాగంగానే స్థానిక పీహెచ్‌సీలో అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీపీ మహమూద్ హాజరయ్యారు. కమిటీల సమన్వయంతో ప్రభుత్వ నిధులతో ఆస్పత్రికి మౌలిక వసతులు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని, ఆయన కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి తోడు పడతామన్నారు.

వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం మేలు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసు


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులు

పీలేరు రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాజీకి అర్హత కలిగిన వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో మేలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాసు అన్నారు. మంగళవారం పీలేరు కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీస్, కక్షిదారుల అవగాహన సదస్సులో జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంతో వివాదాలు పరిష్కరించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. న్యాయం అందరికీ సమానమమేనని, అయితే తప్పు చేసిన వారికి దండన తప్పదన్నారు. ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా మన జీవన ప్రయాణం ప్రశాంతంగా ముందుకు పోతే ఎటువంటి ఇబ్బందులు ఉత్పన్నం కావని తెలిపారు. న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా కమిటీల నియామకం


మల్లికార్జునరెడ్డికి జాబితా అందిస్తున్న భాస్కరాచారి

మదనపల్లె టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత కమిటీల నియామకాలను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని మదనపల్లె నియోజకవర్గ పరిశీలకులు గుర్రం మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 26వ వార్డు సొసైటీకాలనీలో టీడీపీ నేత అప్పినపల్లె భాస్కరాచారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సీనియర్ నేతల సూచనలతో, టీడీపీ బలోపేతం కోసం కృషి చేసిన వారికి తగిన గుర్తింపు వుంటుందన్నారు. కార్యక్రమంలో రంగస్వామినాయుడు, నాదెండ్ల అరుణ్‌తేజ్, గగన్, జస్వంత్, రాధమ్మ, ప్రణీత్, శ్రీనివాసులు, ఈశ్వరమ్మ, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

'వాల్టా' ఉల్టా

చట్టం వారికి చుట్టం ● బట్టీల్లో బూడిదవుతున్న పచ్చదనం
అక్రమంగా కలప రవాణా ● చోద్యం చూస్తున్న అధికారులు


ఇటుక బట్టీలకు తరలిస్తున్న కలప

గుర్రంకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): చట్టం పలువురికి చుట్టమైనట్లుంది. వాల్టా చట్టాన్ని సైతం తుంగలో తొక్కుతూ పచ్చదనాన్ని నిలువునా బూడిద చేస్తున్నారు. కలపను చెట్టును బట్టి ఇంటి పనులకు, మరికొన్నింటిని వ్యాపారం నిమిత్తం తరలించేస్తున్నారు. కలప వ్యాపారుల ధాటికి విలువైన వేప, టేకు, మామిడి, చిగురు, మర్రి, చింత, నీలగిరి, ఊడుగ, రోజ్‌వుడ్ అంతరించిపోతున్నాయి. మొక్కలను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి అంటూ ఓవైపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన సదస్సులు, ప్రత్యేకించి కార్యక్రమాలు చేపడుతున్నా వ్యాపారులు వృక్షాలను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వివరాల్లోకెళితే...

కలప అక్రమ రవాణా వ్యాపారులు పచ్చదనాన్ని నిలువునా నరికేస్తు న్నారు. అక్రమార్కుల ధాటికి పచ్చదనం బట్టీల్లో కాలిపోతుండగా మరికొన్ని సా మిల్లుల్లో కలిసి పోతోంది. దీంతో భారీ వృక్షాలు రోజు రోజుకూ నేలకొరుగుతుండడంతో పచ్చదనం అంతరించిపోతోంది. పగలు వృక్షాలను యంత్రాలతో కత్తిరించి చీకటి పడగానే ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో ఉన్న భారీ వృక్షాలను సైతం కొందరు నేతలు గుట్టుచప్పుడు కాకుండా కత్తరించి సొమ్ము చేసుకుంటున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. రోజూ పదుల సంఖ్యలో కలప ట్రాక్టర్లు అటవీ, రెవెన్యూ శాఖ అధికారుల కళ్లెదుటే వెళుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో విలువైన కలప బట్టీల్లో బూడిదవుతోంది.

గుర్రంకొండ మండలంలో కలప వ్యాపారులు ఇష్టానుసారంగా పచ్చదనాన్ని కాల్చేస్తున్నారు. ఎల్లుట్ల, టి.పసలవాండ్లపల్లె, నడిమిఖండ్రిగ, శెట్టివారిపల్లె, గుర్రంకొండ, చెర్లోపల్లె, అరిగెలవారిపల్లె, తరిగొండ, మర్రిపాడు, సంగసముద్రం, రామాపురం గ్రామాల్లో అటవీ ప్రాంతం అధికంగా ఉంది. ఈ అటవీ ప్రాంతాల్లో విలువైన భారీ కలప వృక్షాలున్నాయి. అంతేకాకుండా రైతుల పొలాల్లో కూడా వివిధ రకాల కలప వృక్షాలున్నాయి. ఈ వృక్షాలను కలప వ్యాపారులు యంత్రాలతో నరికేస్తున్నారు. సరిమడుగు, చెర్లోపల్లె, టి.పసలవాండ్లపల్లె, సంగసముద్రం, గుర్రంకొండ, తరిగొండ, అమిలేపల్లె, శెట్టివారిపల్లె, తల్లారివాండ్లపల్లె గ్రామాల నుంచి రోజూ ట్రాక్టర్లలో కలపను తరలిస్తున్నారు. కలప అక్రమ రవాణాపై అటవీశాఖ అధికారులకు రైతులు, ప్రజలు తెలిపినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు.

ట్రాక్టర్ లోడ్ కలపకు...

పట్టణంలోని సా మిల్లులకు కలప తరలించే వ్యాపారులు ట్రాక్టర్ లోడ్ కలప తరలించాలంటే మామూళ్లు చెల్లించాల్సిందే. వివిధ రోడ్డు మార్గాల గుండా రోజు ఎన్ని ట్రాక్టర్ల కట్టెల లోడ్‌తో వస్తున్నాయో వ్యాపారులే లెక్కిస్తారు. సాయం కాలం ఆ రోజు వచ్చిన ట్రాక్టర్ల నుంచి సొమ్ము వసూలు చేసి సంబంధిత శాఖ అధికారులకు ముట్టచెబుతున్నారు. దీని కోసం వ్యాపారులే దళారులుగా మారారు. అంతేకాకుండా ఇక్కడ నుంచి మదనపల్లె, బయట ప్రాంతాలకు కలపను తరలించడానికి వాహనాన్ని బట్టి ధర విధించినట్లు సమాచారం. అధికారులు నియమించిన వ్యక్తులే మామూలను వసూలు చేసి చేరవేస్తున్నారని రైతులు చర్చించుకుంటున్నారు.

కలప తరలిస్తే చర్యలు తప్పవు

మండలంలో వివిధ గ్రామాల్లో అక్రమంగా వృక్షాలను వ్యాపారులు నరికేస్తున్నారు. ప్రభుత్వ భూములో ఉన్న చెట్లను కూడా కత్తిరించి తరలిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా వృక్షాలను నరకరాదు. అలాగే అటవీ శాఖ అధికారుల పేరిట మామూలను వసూలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో పర్యటించి పచ్చదనంపై ప్రజలు, రైతులకు అవగాహన కల్పించి పర్యావరణాన్ని కపాడుతాం.

రామ్‌మోహన్, అటవీశాఖ బీట్ ఆఫీసర్, గుర్రంకొండ



రూ.40కోట్లతో మదనపల్లె అభివృద్ధి

సుపరిపాలన-తొలిఅడుగులో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ● తంబళ్లపల్లెలో టీడీపీ నేతలు


కురవంకలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా - తంబళ్లపల్లెలో టీడీపీ నేతలు

మదనపల్లె టౌన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రూ.40కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం కురవంక పంచాయతీలో సుపరిపాలన-తొలిఅడుగులో భాగంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కురవంకలో ఒకరు రోడ్డుకు అడ్డంగా నిర్మాణాలు చేసినట్లు ప్రజలు ఫిర్యాదు చేయడంతో సర్వే చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశిస్తామన్నారు. కురవంక ప్రాంతానికి కనెక్టింగ్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.30లక్షలతో ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. పట్టణంలో బెంగళూరు బస్టాండు వద్ద డ్రైనేజీ, కదిరి రోడ్డు వద్ద డ్రైనేజీ నిర్మాణాలకు అధికారులతో కలిసి పరిశీలించామని, వీటికి రూ.2.5 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. కురవంక టీడీపీ నేతలు బెల్లె రెడ్డిప్రసాద్, పి.వినోద్‌కుమార్, భైగారి భారతి, బాబా ఫకృద్దీన్, నాగార్జున గాంధి, గంగారపు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

కురవంక పంచాయతీ వాసి షేక్ షాహీరాకు రూ.5లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే షాజహాన్‌బాష అందజేశారు. గాండ్లపల్లె హరిజనవాడ వాసి పార్వతి కుమారుడు రవికుమార్ చెట్టుఎక్కి కిందపడడంతో నడుము విరిగిందని అతడిని ఆదుకోవాలని టీడీపీ నేత సుద్దిళ్ల సుధాకర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ పథకం కింద ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న సీఎం

తంబళ్లపల్లె, జూలై 15(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను వివరించారు. వికలాంగ అధ్యక్షుడు రామాంజులు, సిద్దమ్మ, తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, రషీద్ బాష, మునాఫ్, ఐసుల కిట్ట పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు అన్నదానం


ఆర్టీసీ బస్టాండ్‌లో అన్నం వడ్డిస్తున్న ఎన్ఎంయూ నేతలు

మదనపల్లె అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు మదనపల్లె 1అండ్ 2 డిపోల ఆర్టీసీ ఎన్ఎంయూ నేతలు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆర్టీసీ బస్టాండ్‌లో కేక్‌కట్ చేసి ఆర్టీసీ ఉద్యోగులకు పంచిపెట్టారు. అనంతరం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కడప జోనల్ అధ్యక్షుడు వినోద్ ఆధ్వర్యంలో రోగులకు స్వీట్స్, పండ్లు పంపిణీ చేశారు. అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థలో పిల్లలకు, వృద్ధులకు భోజన వసతి కల్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో కార్మికులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మదనపల్లె వన్ అండ్ టూ డిపోల అధ్యక్ష, కార్యదర్శులు నగరిమడుగు రమణ, చలపతి, రెడ్డిబాషా, సుబ్రహ్మణ్యం, పీలేరు డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీవిరమణ, ఆదినారాయణ, వీఎస్ రాజులతోపాటు ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు కార్యదర్శులు తిరగాలి


చెత్త సేకరణపై తనిఖీ చేస్తున్న అధికారులు

నిమ్మనపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించాలని ఎంపీడీఓ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం రెడ్డివారిపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీలో సిబ్బంది చేపడుతున్న చెత్త సేకరణను తనిఖీ చేపట్టారు. ప్రభుత్వం స్వచ్ఛతాహి కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు. దీనికి అనుగుణంగా కార్యదర్శులు రోజూ ఉదయం 7గంటలకే గ్రామాల్లో పర్యటించి అంబుడ్స్‌మెన్‌ల ద్వారా వున్న తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. అనంతరం గ్రామంలోని తాగునీటి బోర్లను పరిశీలించి గ్రామీణులకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ బాలరాజు, కార్యదర్శి గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు


పొలంపిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ మంజుల

నిమ్మనపల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ మంజుల పేర్కొన్నారు. మంగళవారం మూష్టూరు పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లిలో పొలంపిలుస్తోందిలో ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు నాణ్యమైన విత్తనాలు నాటితేనే అధిక దిగుబడులు సాధ్యమవుతుందన్నారు. పంటలకు తప్పని సరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని దాని వలన ప్రకృతి వైపరిత్యాల వలన పంటకు నష్టం వాటిల్లితే ఇన్సూరెన్స్ వస్తుందని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో రైతు పేరు ఉందా లేదా, రైతుల అర్హుల జాబితా, అనర్హుల జాబితాను సరిచేసుకుని వారి స్టేటస్‌ను సమీప రైతు భరోసా కేంద్రాల్లో చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహయకులు శ్రీకాంత్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక


గుర్రంకొండ హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

గుర్రంకొండ, జూలై 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో పూర్వ విద్యార్థులు మంగళవారం కలిశారు. 1979-1980లో టెన్త్ పూర్వ విద్యార్థులు కలిసి చదువుకున్న సమయంలో చేసిన అల్లరి చేష్టలు, ఆడిన ఆటలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠాలు నేర్పిన గురువులను గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో టెన్త్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ఏటా నగదు బహుమతిని అందజేస్తామని ప్రకటించారు. విద్యార్థులకు స్పోకన్ ఇంగ్లీష్ పుస్తకాలు, డిక్షనరీలను అందజేశారు.

భవనం పూర్తయినా... కాంట్రాక్టరు చేతిలోనే తాళాలు

బిల్లులు రాలేదని... భవనం అప్పగించని వైనం...



పెద్దతిప్పసముద్రం జూలై15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లాక్ పబ్లిక్ యూనిట్ భవనం (బీపీహెచ్‌యూ) నిర్మాణం పూర్తయి ఏడాది కావస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోలేదు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో గత వైసీపీ ప్రభుత్వంలో రూ. 50 లక్షలతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను ప్రారంభించి కాంట్రాక్టర్ నిర్మాణాలను పూర్తి చేశారు. అయితే తనకు బిల్లులు రాలేదని, బిల్లులు మంజూరు కానిదే తాళాలు ఇవ్వనని కంట్రాక్టర్ భీష్మించుకుని కూర్చున్నాడు. దీంతో ఆస్పత్రి సిబ్బంది ఇరుకుగా ఉన్న ఆస్పత్రిలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. లక్షలు వెచ్చించి నిర్మాణాలు పూర్తి చేసినా పూర్తి అయిన భవనాలు అలంకార ప్రాయంగా మారాయి. కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు కంట్రాక్టర్‌కు బిల్లులు మంజూరు చేసి పూర్తి అయిన భవనాన్ని స్వాధీనం చేసుకుని భవనాన్ని ప్రారంభించాలని కోరుతున్నారు.

నేడు బి.కొత్తకోటలో ప్రేమ ప్రవాహిని రథయాత్ర

బి.కొత్తకోట, జూలై 15(ఆంధ్రజ్యోతి): లోక కళ్యాణం కోసం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర నేడు బి.కొత్తకోటకు చేరుకోనున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ శేఖర్ బాబు, సమితి సభ్యులు వివి రెడ్డి, షాజహాన్‌బాషా తెలిపారు. సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో భాగంగా ఈయాత్ర చేపట్టినట్లు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం పట్టణంలోకి ప్రవేశించి పాశంవీధి మీదుగా సత్యసాయి మందిరానికి చేరుకుంటుందన్నారు. బాబా మందిరంలో ప్రత్యేక పూజల అనంతరం దిగువబస్టాండు, బైపాస్‌రోడ్డు, రంగసముద్రం రోడ్డు, జ్యోతిసర్కిల్ మీదుగా తిరిగి మందిరం చేరుకుంటుందన్నారు. 5దివ్యరథాలు దేశవ్యాప్తంగా 30వేల కి.మీలు 500జిల్లాల్లో పర్యటించి సత్యసాయిబాబా దర్శనాన్ని భక్తులకు ప్రసాదిస్తున్నాయన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు

మదనపల్లె అర్బన్, జూలై 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ వన్ డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభను మంగళవారం నిర్వహించినట్లు ఆ డిపో మేనేజరు మూరే వెంకటరమణరెడ్డి తెలిపారు. జూన్‌లో ప్రతిభ కనపర్చిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు నగదు బహుమతులు అందజేశారు. ఈపీకే 36.58. ఓఆర్ 66.77,కేఎంపీఎల్ 5.51 స్థాధించి రీజియన్‌లోనే ప్రథమ స్థానంలో వన్‌డిపోను నిలిపి ఆర్టీసీ ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆయన కోరారు. అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ములకలచెరువు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులను ఎస్టీయూ నేతలు సన్మానించారు. బదిలీల్లో భాగంగా దేవళచెరువు హెచ్ఎంగా బాధ్యతలు స్వీకరించిన రామా, ఉపాధ్యాయులు రామాంజులు, రఫీ, రాజారెడ్డి, ఖాదర్‌వలి, గంగాద్రి, ఇంతియాజ్‌ను సన్మానించారు. నేతలు అమరనాథరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీరాములు, శ్రీనివాసులు రెడ్డి, రాజారెడ్డి, సుబ్బరాయప్ప, ఉమ్మడి వెంకరమణ, రెడ్డెప్ప, సుదాకర్, నాగరాజు పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె, జూలై 15(ఆంధ్రజ్యోతి): అంగళ్లు చేనేత నగర్‌లో ఉన్న మహాత్మా జ్యోతిభాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో 5 నుంచి 9 తరగతుల(ఇంగ్లీషు మీడియం)లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామాంజనేయ రెడ్డి తెలిపారు. 5వ తరగతిలో బీసీ-ఎ 1, బీసీ-బి 2, బీసీ-డీ 2, ఎస్సీ-1, ఎస్టీ-2, ఓసీ/ఈబీసీ-1 సీట్లు, ఆరో తరగతిలో బీసీ-ఎ 1, బీసీ-డీ 1, ఎస్సీ-1, ఎస్సీ-1, ఎస్టీ-1, ఓసీ/ ఈబిసీ-1, ఏడో తరగతిలో బీసీ-ఎ 1, బీసీ-డీ 1, 8వ తరగతిలో ఎస్సీ-2, 9వ తరగతిలో ఎస్సీ-1, అర్ఫిన్-1 సీట్లు ఖాళీలున్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ పోర్టు సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్‌ను తీసుకువచ్చి ఈ నెల 18వ తేదీ లోగా అంగళ్లు చేనేత నగర్‌లో ఉన్న పాఠశాలలో దరఖాస్తు చేసుకుని హాల్ టికెట్లను పొందాలన్నారు. 20న ఉదయం పరీక్ష ఉంటుందన్నారు.

కిరాణా షాపులు తనిఖీ

సిద్దవటం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం, భాకరాపేట, వంతాటిపల్లె, జ్యోతి, జంగాలపల్లె గ్రామాల్లో ఉన్న కిరాణా షాపుల్లో ఎస్ఐ మహమ్మద్‌రఫీ తనిఖీ చేపట్టారు. ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశాలతో ప్రభుత్వ పాఠశాలలకు 100 కి.మీ పరిధిలో కిరాణా షాపుల్లో పొగాకు అమ్మకాలపై తనిఖీ చేశామన్నారు. ఎవరైనా పొగాకు సంబంధిత గుట్కా, ఖైనీ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం

నందలూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రైల్వేకేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే వెలసిన వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో భక్తులు స్వామికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.